

స్వచ్ఛమైన చిరునవ్వుకి.. అచ్చమైన చిరునామా..
వెల కట్టలేని
మీ ఆనందానికి
15 రూపాయలు
ఓ లెక్కేనంటారా?
హాస్యానందం
సంపూర్ణ హాస్య మాస పత్రిక
నవంబర్-2012
₹15/-
హాయెమ్మ పైట వేస్కోవటం
మరచిపోయినట్టుందే...
మతి మరపు
ప్రత్యేక సంచిక

# కార్టూన్ ఉత్సవ్-2012 లో కార్టూన్ కళలో విశిష్ట సేవలందించిన వారికి సత్కారం

సత్కరిస్తున్న వారు-
శ్రీ నరేంద్ర లూథర్ ఐఏఎస్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి,
శ్రీ పొత్తూరి వెంకటేశ్వర రావు, పూర్వ అధ్యక్షులు, ప్రెస్ అకాడమి





శ్రీ జయదేవ్ గారికి...


శ్రీ సత్యమూర్తి గారికి...


శ్రీ శంకు గారికి...


శ్రీ టీపీ గారికి


శ్రీ మోహన్ గారికి...


శ్రీ బాలి గారికి...


హాస్యానందం 'పురస్కార్' శ్రీమతి ... సంపాదకులు శ్రీ పి.రాము




శ్రీ రామకృష్ణ గారికి...


శ్రీ కరుణాకర్ గారికి...


శ్రీ రాంపా గారికి...


శ్రీ ఎ.ఎస్.రాజా గారికి...


శ్రీ పున్నక రామకృష్ణ గారికి...


శ్రీ సుధామ గారికి...


శ్రీ సురేష్ గారికి...



# హాయ్... హాస్యానందంగా...

**హాస్యాభిమానులకు, హాస్యానందం ఆప్తులకు, కార్టూనిస్ట్‌లకు, పాఠకులకు హాస్యాభివందనాలు!**

అక్టోబర్ హాస్యానందం 'థీం' ప్రత్యేక సంచికగా రూపుదిద్దుకుని మీ మన్ననలను పొందింది. నవ్వుతకు ఎల్లప్పుడూ పాఠకుల ఆదరణ ఉంటుందని మరోసారి నిరూపించినందుకు కృతజ్ఞతలు.

అక్టోబర్ 28-30 వరకు హైదరాబాద్‌లో జరిగిన 'కార్టూన్ ఉత్సవ్ 2012'లో కార్టూన్ రంగంలో చేస్తున్న కృషికి హాస్యానందం ఎడిటర్‌గా నన్ను సత్కరించిన సమైక్య భారతివారికి, 'కళాప్రియ' శ్రీ కె.వి. రమణాచారిగారికి నా ప్రత్యేక కృతజ్ఞతలు.

హాస్యప్రియుల అభిమాన పత్రికగా...కార్టూనిస్ట్‌ల మానసపుత్రికగా ప్రతినెలా విడుదలౌతున్న మన హాస్యానందం... ఈ ఉత్సవంలో పాల్గొన్న కార్టూనిస్ట్ మిత్రులందరికీ అభినందనలు తెలుపుతోంది.

తెలుగుకార్టూనిస్ట్‌ల 'కుల'పెద్ద శ్రీబాపుగారి అభినందనలతో శ్రీ జయదేవ్‌గారు ఈ ఉత్సవాన్ని ప్రారంభించారు.

ఇలాంటి ఉత్సవాలు మరిన్ని జరిగి... యువ కార్టూనిస్ట్‌లకు స్ఫూర్తి దాయకం కావాలని కోరుకుంటూ...

ఈ ఉత్సవం నిర్వహించిన 'సమైక్య భారతి' శ్రీసత్యనారాయణగారికి, శ్రీకె.వి.రమణాచారిగారికి కార్టూనిస్ట్ మిత్రులందరి తరఫున హాస్యానందం మనసారా కృతజ్ఞతలు తెలుపుకుంటోంది.

ఈ సంచిక 'మతిమరపు' ప్రత్యేక సంచికగా రూపుదిద్దుకుంది. మన ప్రస్తుత 'గందరగోళ' జీవన విధానంలో టెన్షన్ వలన మతిమరపు చాలామందికి సహజ లక్షణమైపోయింది. నవ్వుల పూతతో మీకందిస్తున్న ఈ సంచికని ఎప్పట్లానే ఆదరిస్తారని ఆశిస్తూ...

ఈ సంచిక రూపకల్పనలో సహకరించిన రచయితలకు, కార్టూనిస్ట్‌లకు నా ధన్యవాదాలు.

చెప్పడం మరిచా... తెలుగు కార్టూనిస్ట్‌ల దినోత్సవం (మే,20) సందర్భంగా శ్రీతలిశెట్టిరామారావు అవార్డు కార్టూన్ పోటీ వివరాలు వచ్చే సంచికలో చూద్దాం!

అందరూ నవ్వుతూ... ఆనందంగా...ఆరోగ్యంగా... వుండాలని కోరుకుంటూ...

-రాము.పి
(ఎడిటర్)


స్వచ్ఛమైన చిరునవ్వుకి... అచ్చమైన చిరునామా...

హాస్యానందం


సంపూర్ణ హాస్య మాస పత్రిక

నవంబర్-2012

| | |
|---|---|
| Publisher&Editor : | Ramu.P |
| Associate Editor : | Sudharani.P |
| Cartoon Editor : | A.V.M |
| Well Wishers : | Tanikella Bharani<br>Jaydev<br>Mallik |
| Full Pillar : | Bnim |
| Designing : | Creative Graphix |
| Creative Team : | Tumbali Sivaji<br>T.Chandra Sekhar<br>Rampa<br>Surya Dubey<br>P.V.Narayana<br>Ramsheshu<br>P.Priyatham<br>Mallikarjun.U |
| Helper : | Raviteja.S |
| Address : | HASYANANDAM,<br>#8-215/4,<br>Near Ramalayam,<br>Po:YERRABALEM<br>Pin 522 503,<br>Mangalagiri Mandal,<br>Guntur dist. |
| Ph : | 9849630637 |

email: hasyanandam @yahoo.com

| | |
|---|---|
| Hyderabad & Telangana Marketing: | Charminar News Agency,<br>1-6-176/1, M.G.Road,<br>Khandoji Bazar,<br>Secunderabad-3.<br>Ph:9346515813 |
| And : | Shams News Agency,<br>Abids, Hyderabad.<br>Ph:040-30680840/41 |




అట్టహాసిని: పూర్ణ










42 వ పేజీలో కథకు బొమ్మ వేయడం చిత్రకారుడు మరచిపోయాడు.

ఎక్కడ ఏ నవ్వులున్నాయో మరచిపోకుండా....



కార్టూనిస్టులు...



## మన జనాలు



# రీ సౌండ్....

శ్రీ బ్నింగారి ప్రత్యేక సంచిక నిజంగా సూపర్బ్... ప్రతి ఒక్కరూ అంత అభిమానంగా శ్రీ బ్నింగారి గురించి రాసింది చదువుతుంటే... నిజంగా ఈయన ఎంత అదృష్టవంతుడు అనిపించింది. శ్రీ శంకుగారు రాసిన 'నేను నమ్మలేని అద్భుతం' చదువుతుంటే కన్నీళ్లొచ్చాయి.

ఒక అద్భుతం... ఒక ఆనందం... ఒక మంచితనం...ఒక ధైర్యం... ఒక కళాఖండం... ఒక స్నేహశీలి... ఇవన్నీ కలబోస్తే శ్రీబ్నింగారు. ఆయన ఎందరికో(నాకూడా) స్ఫూర్తిప్రదాత... ఇన్స్పిరేషన్.

'నా జన్మ చాలా అదృష్టం' ఇంటర్వ్యూ రామూ గారూ భలే వెరైటీగా చేయించారు. కార్టూన్లు చాలా బావున్నాయి. బ్రేవో బ్నిం సంచికను ఇంత బాగా తీర్చిదిద్దిన రాముగారికి నూటికి నూరు మార్కులు వెయ్యాల్సిందే!

**-రాగతి పండరి,((కార్టూనిస్ట్)విశాఖపట్టణం**

అక్టోబర్ హాస్యానందం 'బ్నిం' ప్రత్యేక సంచికగా తెచ్చిన మీకు ప్రత్యేక అభినందనలు. బ్నింగారి గురించి అన్ని ఆర్టికల్ చదివి... చాలా ఆశ్చర్యపోయాను. చాలా అద్భుతమనిపించింది. నిజంగా ఆయన శారీరక పరిస్థితి గురించి... సాధించిన విజయాల గురించి చదువుతుంటే గొప్ప అనుభూతి,ఇన్స్పిరేషన్ కలిగించాయి.

**-గోపాలకృష్ణ,(కార్టూనిస్ట్)హైదరాబాద్**

బహుముఖ ప్రజ్ఞావంతులైన బ్నింగారి గురించి ఎన్నో తెలియని విషయాలు తెలియ జేసిన హాస్యానందానికి కృతజ్ఞతలు.

**-ఆర్.సుధారాణి,గుంటూరు**

అక్టోబర్ హాస్యానందం ఒక 'వ్యక్తి' గురించిన విశేషాలతో ప్రచురిస్తూ...ఎక్కడా బోర్ ఫీలవకుండా పత్రికలో ఉండాల్సిన కథలు, కార్టూన్లతో రంజింపజేస్తూ మీరు తీసుకున్న శ్రద్ధ అభినందనీయం. **-ఎస్.ప్రమీలరాణి,నెల్లూరు.**

బ్నిం సంచిక అద్భుతం. **-రావేళ్ల శ్రీనివాసరావు, విజయవాడ**

బ్నిం ప్రత్యేక సంచిక ఎక్సలెంట్...మెమోరబుల్...ఎక్స్ట్రార్డనరీ! కంగ్రాట్స్!! **-సుదర్శనం, హైదరాబాద్**

బ్నిం స్పెషల్ అదిరింది... నా గుండె చెదిరింది... ఇంకా మాట ల్లేవండి... **-శంపు, హైదరాబాద్**

అక్టోబర్ సంచిక చాలా బాగుంది. ముఖ్యంగా బ్నింగారితో ఇంటర్వ్యూ చాలా నావల్టీగా ఉంది. అలాగే ఆయన అసిస్టెంట్స్ అభిప్రాయలు కూడా ప్రచురించడం హర్షణీయం. **-ఎమ్.పి.రాజు,ఖమ్మం**

బ్నిం స్పెషల్‌గా ముస్తాబయిన హాస్యానందం చాలా బాగుంది. బ్నింగారి కథలు చాలా బావున్నాయి. ఆ కథల పుస్తకం ఎక్కడ మాకు దొరకుతాయో తెలియజేయగలరు. **-పి.కిరణ్ కుమార్, బొబ్బిలి**

**బ్నిం,12-11-448, వారాసిగూడ, సికింద్రాబాద్-500061.**
**ఫోన్ 040-27070169**

## ప్రత్యేకసంచికపై బ్నిమ్మానందం!



# ఆ టాపిక్! -ఈ కార్టూన్

నా స్కూల్ రోజుల్లో మా తెలుగు మాష్టారుగారు రంగస్వామి అయ్యంగారుతో ఒక రోజున "సార్! నేను కథ రాస్తున్నాను సార్" అన్నాను.

ఆయన సంతోషించి, "మంచిదమ్మా... కథావస్తువేమిటి?" అనడిగారు.

"పెన్సిల్ సార్" అని సమాధానమిచ్చాను.

ఆయన మరింత సంతోషించి- "భలే...! పెన్సిల్ నిర్మాణము, దాని ఉపయోగములు గురించి కథ రాస్తావా?" అని ఆప్యాయంగా నన్ను దగ్గరికి లాక్కుని ప్రశ్నించారు.

నేను చేతులు వెనక్కట్టుకుని, "లేదు సార్... కథను పెన్సిలుతో రాయబోతున్నాను" అని వినయంగా చెప్పాను.

ఆయన నన్ను చిరాగ్గా చూసి "హుం కథావస్తువు అంటే కథ అంశము అని అర్థం. పోయి నీ సీట్లో కూర్చో ఫో" అని నన్ను తోసి, బ్లాక్‌బోర్డువైపుకి తిరిగి పాఠం చెప్పడం ప్రారంభించారు.

ఈ సంఘటన ఎందుకు గుర్తుచేశానంటే... ఈ నెల నా టాపిక్... ఈ 'వస్తువు' లేదా 'అంశం' గురించే!


కార్టూన్ సబ్జెక్టు ఏదైనా కావచ్చని యీ పాటికి పాఠకులకి విదితమయ్యే వుంటుంది. సంఘటనలూ, వ్యక్తులూ, పరిసరాలూ, వస్తువులూ (పెన్సిలు, రబ్బరు, పెన్ను, కత్తి... ఏదైనా కావచ్చు) ఇలా... దేనిమీదయినా కార్టూనులు సృష్టించవచ్చు. హాస్యం పండించనూ వచ్చు.


నా ఫేస్‌బుక్ మిత్రుల్లో ఒకరు శ్రీమతి జ్యోతిర్మయిగారు. యోహాన్స్‌బర్గ్ (సౌత్ అమెరికా)లో వుంటారు. చక్కటి కళాకారిణి.

ఈమధ్య పేపరుతో డోర్‌మాట్స్, టేబుల్ మాట్స్ చేసి, ఆ ఫోటోలని ఫేస్‌బుక్‌లో పోస్ట్‌చేశారు.

ఆవిడ చేసిన ఒక డోర్‌మాట్ నన్ను ఆకర్షించింది.


ఆ వస్తువుమీద ఈ కార్టూన్ గీశాను.





## గీతల్లో కితకితలోళ్ళు...

పడీ పడీ పగలబడి నవ్వుకోవాలన్నా...
నవీ నవ్వీ పొట్ట పట్టుకోవాలన్నా...
నవ్వలేక క్రిందపడి కొట్టుకోవాలన్నా...
మొక్కపాటివారి బారిస్టర్ పార్వతీశం చదవాలన్నా!



గీత: శంకర్ ✦ రాత: బి.ఎమ్.పి.సింగ్





మతిమరుపు స్పెషల్

# మరపు ఎంత మధురం


శ్రీనివాసరావు వైద్యుల

7702715055


సాయంత్రం ఆరుగంటలవుతోంది. చలి కాలం సాయం సమయం అప్పుడే చిరుచీకట్లు కమ్ముతోంది.

సంతానం ఆఫీసునుండి ఇంటికొచ్చాడు.

బర్రుమని చప్పుడుతో ఆగిన స్కూటర్ శబ్దం వింటూనే నాలుగేళ్ళ బాబిగాడు ఇంటిగేటు బయటకు దారితీశాడు.

"అమ్మా! నాన్నొచ్చాడే" అంటూ.

సంతానం గుమ్మంలోకి రాగానే పుత్రరత్నం సతాయింపు మొదలెట్టాడు.

"నాన్నాయ్! నాకు బ్లా చాక్లెట్లు డైరీమిల్క్ చాక్లెట్లూ తెస్తానన్నావుగా సాయంత్రం ఆఫీసు నుండీ వచ్చేటప్పుడు. మరి తెచ్చావా?"

"అరేయ్ సారీరా! మర్చిపోయానురా! రేపు తప్పకుండా తెస్తాలే" బుజ్జగింపుగా బ్రతిమాలుతూ అన్నాడు సంతానం.

"నేనేమడిగినా అన్నీ మర్చిపోతావు నాన్నా నువ్వు! మరి అమ్మకు మల్లెపూలు తేవడం ఎందుకు మర్చిపోవు" ప్రశ్నించాడు పుత్రరత్నం.

"అరేయ్ బాబిగా! ఏంటా అరుపులు వీధి గుమ్మంలో. నాన్నను ముందు లోపలకు రానియ్యి" అరిచింది తాయారు.

"ఏమండీ! మరి కాఫీపొడి నిండుకుందండీ. సాయంత్రం ఆఫీసునుండి వచ్చేటప్పుడు తెస్తానన్నారు. తెచ్చారు కదా" పాజిటివ్‌గా అడిగింది తాయరు.

"అరరే! మర్చిపోయా తాయారూ... మరి ఇప్పుడెలా?"

'అన్నీ మర్చిపోతారు. ఏం మనుషులండీ మీరు! కాఫీపొడి ప్యాకెట్ తెస్తేనే కాఫీ మీకు. ఇక మీ ఇష్టం" మూతిముడిచింది తాయరు. నిర్వేదంతో నిట్టూర్చాడు పాపం సంతానం.

◆ ◆ ◆

ఇలా మతిమరుపు మహాలింగాలు మనమధ్య ఎందరో వున్నారు. ఇలాఎందుకు జరుగుతోంది!

మనలో చాలామంది ఇల్లు వదిలి బయటకు వెళ్ళగానే ఇంటివిషయాలు మర్చిపోతారు.

మనం మన వ్యాపారాలమీద, ఉద్యోగాల మీద ఎక్కువ దృష్టి పెట్టడమే. మనం చేయ వలసిన పనులు పూర్తికాని సమస్యలు, ఊహించని పనివత్తిడి పెరిగిపోయి ఒక్కోసారి ఏ విషయం మీద పూర్తిగా దృష్టి పెట్టలేకపోవటం, ఒకే సమయంలో రకరకాల పనులు చెయ్యలేము కదా!

మతిమరుపు ఏ స్థాయిలో వుండవచ్చో కాస్త పరిశీలిద్దాం.

ఒకసారి పనివత్తిడిలో వున్న ఒక గుమస్తాకు అర్జంట్‌గా లీవు కావలసి వచ్చింది. అతడు లీవ్‌లెటర్ ఇలా రాశాడు.

"సర్! నేను సెలవుతో బాధపడ్తున్నాను. అర్థంటుగా నాకు మూడురోజులు సిక్‌నెస్ మంజూరు చేయగలరు?

ఇట్లు మీ విధేయుడు..."

మరోసారి... ఒక ఆఫీసులో పని జోరుగా సాగుతోంది. చట్టాన్ని అతిక్రమించి, రూల్సుని అధిగమించి వ్యవహరిస్తున్న కొన్ని కంపెనీలపై లీగల్ యాక్షన్ (ప్రాసిక్యూషన్) వేయవలసి వుంది. రికార్డ్ అసిస్టెంట్ 'ప్రాసిక్యూషన్స్' అన్న మాటను తప్పుగా వ్రాసి తన డ్రాఫ్టును టైపిస్ట్‌కి పంపాడు.

ఆ టైపిస్ట్ అనాలోచితంగా తన టేబిల్ మీద కొచ్చిన డ్రాఫ్టును యథాతథంగా టైప్ చేసింది.

ఫెయిర్ కాపీలో మొదటివాక్యం ఇలా వుంది.

"ది ఫాలోయింగ్ కంపెనీస్ రిక్వైర్డ్ టు బి ప్రాస్టిట్యూటెడ్."

ఇదంతా స్టాఫ్ మతిమరుపు వలన జరిగిందని గ్రహించిన ఆఫీసర్ తలబాదుకున్నాడు.

మతిమరుపు రకరకాలుగా వ్యక్తమవుతుంటుంది నిజజీవితంలో. ముఖ్యంగా మధ్యతరగతి జీవుల్లో మతిమరుపు ఒక వరం. కొందరికి మరపు అతిమధురం. ఎలాగంటే...

ధరలు ఆకాశాన్ని తాకుతుంటే చాలీచాలక జీతాల్తో ఈ రోజుల్లో మధ్యతరగతి గృహస్తులకు ఇంట్లో వాళ్ళ కోరికలు తీర్చటం పెద్దసమస్య. అందుకు పరిష్కారం–మతిమరపు!

పిల్లలు నోటు పుస్తకాలడిగినా... ఈడొచ్చిన కూతురుకు డ్రెస్‌లు కొనాలన్నా... ముసలి తల్లి దండ్రులకు మందులు కొనాలన్నా... భార్యకు గృహనిర్వహణకై డబ్బులు ఇవ్వాలన్నా... మధ్య తరగతి కుటుంబ పెద్దలకు మతిమరపే శరణ్యం. మతిమరపు ఒక వరం. మరపు అతి మధురం!



రోజూ తాగొచ్చేవాడికి ఇల్లాలుకిచ్చిన ప్రామిస్ గుర్తుండదు. నిన్న "ఇక రేపటినుండీ మందు ముట్టనని" పిల్లలమీద ఇంటి ఇలవేల్పు శ్రీ వెంకటేశ్వరుడి మీద చేసిన ప్రమాణం మర్నాడు మందు టైముకు కన్వీనియెంట్‌గా మరిచిపోతాడు మన మధువు శోధనరావు (అసలు పేరు మధుసూదనరావు).

కొంతకాలంగా ప్రేమిస్తూ ప్రియురాలి కటాక్షానికి అనుక్షణం తపించిన ప్రేమారావు 'ఆ అవసరం' తీరగానే ప్రియురాలికి ప్రామిస్ మరచిపోయినట్టు నటిస్తాడు. క్రమేణా ప్రియురాలిని కలవటం తగ్గిస్తూ సమయపాలన చేయకుండా తన లవర్‌ను పూర్తిగా మరచిపోతాడు మన ప్రేమారావు. మరుపు అతి మధురం కదా మరి!

పురాణాలల్లో సైతం మతిమరుపుకి ప్రాధాన్యం చూపబడింది. దుష్యంత మహారాజు శకుంతలతో ప్రేమాయణం సాగించి గాంధర్వ వివాహం చేసుకుని కూడా తన రాజ్యానికి చేరుకున్నాక అంగుళీయకం (ఉంగరం) చేజారటం వలన శకుంతలను మరచిపోతాడు.

శకుంతల దుష్యంతుల సంతానమైన భరతుడి వారసులం 'భారతీయులం మనం! మతిమరపు మన జన్మహక్కు. మరపు మన నేషనల్ హెరిటేజ్! అంటే వారసత్వ సంపద అన్నమాట!

◆ ◆ ◆

మతిమరపును కన్వీనియెంట్‌గా అవసరార్థం నటించేవారిని మనం ఏమీ చెయ్యలేము.


మేధావులు, శాస్త్రవేత్తలు కూడా మతిమరపు పీడితులే! వాళ్ళు వృత్తిపరమైన పరిశోధనలలో మునగితేలుతూ పరిసరాలనూ, ఇతర వ్యవహారాలను ఏ మాత్రం పట్టించుకోలేరు. వీళ్ళు అన్యమనస్కులై, ఎప్పుడూ ఏవో ఆలోచనలతో మునిగితేలుతుంటారు. వీరి మాటలు, చేష్టలు కూడా ఒక్కోసారి నవ్వు పుట్టిస్తుంటాయి. అందువల్లనే కాబోలు, వీళ్ళని అబ్సెంట్ మైండెడ్ ప్రొఫెసర్స్ అని మిగిలినవారు సరదాగా అంటూ ఆటపట్టిస్తుంటారు.


ఏదేమైనాగాని మతిమరపు ఒక వరం. మరపు అతి మధురం! కష్టాలను, బాధలను తాత్కాలికంగా ఉపశమింపజేసి మనిషి జీవితాన్ని ఒక గాడిలో పెట్టే అద్భుతశక్తి మతిమరపుకుంది.


అందువలన మరపుకు జై!

మతిమరపుకు జై! జై!

# మరుపానందం





# మల్లిక్ కామెడీ కథలు

## అల్లుడుగార్కి దీపావళి బహుమతి

"పోస్ట్...!" గుమ్మంలోంచి అరిచాడు పోస్టుమేన్.

ఆనందరావు పోస్టుమెన్ చేతిలోంచి కవరం దుకుని చింపి ఉత్తరం చదివాడు.

ప్రియమైన అల్లుడుగారికి,

ఇప్పుట అంతా క్షేమం. అప్పుట మీరంతా క్షేమమని తలుస్తాను. వచ్చేవారం దీపావళి పండుగ వస్తుందని మీకు తెలుసు. మీ పెళ్ళయిన తరువాత ఇదే మొదటి దీపావళి పండగ కాబట్టి మీరు, అమ్మాయి మా ఇంటికి రావలసిందిగా కోరుతున్నాం. మీకు పెళ్ళయ్యిన తరువాత మొదటి సంక్రాంతి పండక్కి వచ్చారు. మొదటి ఉగాది పండక్కి వచ్చారు. మొదటి దసరా పండక్కి వచ్చారు... అలాగే మొదటి దీపావళి పండక్కి ఎలాగూ వస్తారని తెల్సి మీరు రాక ముందే మేమే రమ్మని రాస్తే కనీసం మేము రమ్మంటేనే మీరు వచ్చారనే ఆత్మతృప్తయినా మీకు మిగుల్తుందని ఇలా ఆహ్వానిస్తూ రాస్తున్నాం. మీకేమైనా అర్జంటు పనులుంటే రాకపోయినా మరేం ఫర్వాలేదు. మేము ఏమీ అనుకోము. ఆ మాత్రం మీ బాధని అర్థం చేసుకోపోతే ఎలా? అమ్మాయిని అడిగామని చెప్పండి. ఇక్కడ అందరూ మిమ్మల్ని అడిగినట్లు చెప్పమన్నారు.

ఉంటాను బాబు,

ఇట్లు

అశ్రునయనాలతో

మీ టీద మాంగారు.

ఉత్తరం చదివిన ఆనందరావు ఆనందంతో కెవ్వుమని అరిచాడు. అతని భార్య సరస్వతి కూడా సంతోషంతో కెవ్వుమని అరిచింది.

"నేనైతే కొత్తల్లుడిని కాబట్టి పండగ బహుమతిగా నాకేమైనా ఇస్తారని కెవ్వుమని అరిచాను. నువ్వెందుకు అలా అరిచావ్?" ఆనందరావు సరస్వతిని అడిగాడు.

"మరి పుట్టింటికి వెళ్తున్నానంటే నాకానందంగా వుండదూ... అందుకే నేనట్టా అరిచా..."

"కెవ్వు..." పోస్టుమెన్ గూబపగిలేలా ఇంకా గట్టిగా అరిచాడు.

ఆనందరావు, సరస్వతి ఉలిక్కిపడి కింద పడ్డారు.

"నువ్వెందుకంత చేటున అరిచావ్?... మా ఆనందమే నీకానందమా?..." కిందనుండి లేచి బట్టలకంటిన దుమ్ము దులుపుకుంటూ చిర్నవ్వుతో పోస్టుమెన్‌ని అడిగాడు ఆనందరావు.

"మీ ఆనందం నాకానదం ఎందుకౌతుంది?.. మాంగారి ఇంటినుండి మీరు దోచుకొచ్చేదాంట్లో నాకేమైనా వాటా ఇస్తున్నారా ఏమైనానా?..." మొహం చిట్లిస్తూ అన్నాడు పోస్టుమెన్.

"మరెందుకట్టా మమ్మల్ని కిందపడేశావ్. ఆ!"

పోస్టుమెన్ తలొంచుకుని సిగ్గుపడ్డాడు.

"మరేమో నేను మీకంటె కొత్తల్లుడిని... నా పెళ్ళి పోయిన వారంలోనే అయ్యింది. మీకు ఇది మొట్టమొదటి దీపావళి పండగైతే నాకు ఇదే మొదటి పండగ... అందుచేత నాకు మా మాంగారు మీ కంటె మాంచి బహుమతులు ముట్టజెప్తారు... కెవ్వ్వ్వ్..." మరోసారి సంతోషంతో కేకేసి వెళ్ళిపోయాడు పోస్టుమెన్.

ఆ కేకకి మరోసారి ఉలిక్కిపడి దబ్బున కింద పడ్డాడు ఆనందరావు.


"చూశారా?... వాడి సంతోషం గమనించే నేనిందాక పడినప్పట్నుండీ లేవకుండా ఇలానే కింద కూర్చున్నా మళ్ళీ పడాల్సి వస్తుందని... మీలాంటి తెలివితక్కువ వాళ్ళకిచ్చి మా అమ్మా నాన్నలు నా గొంతు కోశారు..." కళ్ళు తుడుచుకుంది సరస్వతి.

దీపావళికి రెండ్రోజుల ముందు భార్యని తీసుకుని మాంగారు పరబ్రహ్మం ఇంటికి బయలుదేరాడు ఆనందరావు.

వరండాలో కూర్చుని వున్న పరబ్రహ్మానికి అల్లుడిని చూడగానే మొహం పాలిపోయింది.

"ఏంటండీ మాంగారూ... నన్ను చూడగానే మొహం అట్లా పాలిపోయింది? ఆఁ" కొంటెగా అడిగాడు ఆనందరావు మాంగార్ని.

"అబ్బే... అది మొహం పాలిపోవడం కాదులే అల్లుడూ... మొహానికి పౌడర్ కాస్తెక్కువ పూసుకున్నానులే..." తొట్రుపాటు పడుతూ జవాబిచ్చి లోపలికి తొంగిచూస్తూ- "ఏమేవ్... అమ్మాయి, అల్లుడు వచ్చారు గానీ ఇలా వస్తావ్..." అని



అరిచాడు.

లోపలినుండి ఆనందరావు అత్తగారు అండాళ్ళమ్మ హడావిడిగా వచ్చింది.

అల్లుడ్ని చూడగానే ఆవిడ గుడ్లనీరు కుక్కుకుంది.

"బాగున్నారా అల్లుడుగారూ?" అని ప్రశ్నించి ఆనక నోట్లో కొంగు దోపుకుని దుఃఖాన్ని ఆపుకుంది.

"బాగానే వున్నాను... మీరు బాగున్నారా?"

"ఇప్పటిదాకా బాగానే వున్నాం అల్లుడూ..." పరబ్రహ్మాం కండువాతో కళ్ళు తుడుచుకుంటూ అన్నాడు.

అండాళ్ళమ్మ కుమిలిపోయింది.

ఆనందరావు మరదలు కమల బావగార్కి కాళ్ళుకడుక్కోడానికి నీళ్ళిచ్చింది.

కాళ్ళు కడుక్కుని మాంగారి వైపు తిరిగి–

"అవునూ! ఉత్తరంలో ఏంటి ఇట్లు, నీ బీద మాంగారు అని సంతకం చేశారు... ఓహో... ఏదో గూడుపుఠాణి చేస్తున్నట్లున్నారే... అవేం నా దగ్గర చెల్లవ్." అన్నాడు ఆనందరావు అల్లుడు దర్జాతో.

"ఉహుంహు హు..." నోటికి చీరకొంగు ఇంకా దోపేస్కుంటూ కుమిలిపోయింది అండాళ్ళమ్మ.

ఇంతలో మరిది శీనుగాడు పరిగెత్తుకుంటూ వచ్చాడు.

"బావా... బావా... ఊర్నుండి నాకోసం ఏం తెచ్చావ్...?" అని సంబరంగా అడిగాడు.





ఆనందరావు ఆశ్చర్యంగా వాడివంక చూసి–

"ఓర్ని! భలేవాడివే... నేను నీకోసం ఏమైనా తేవాలా?... ఇంతకీ ఈ ఇంటి అల్లుడ్ని నేనా? లేకపోతే నా ఇంటికి అల్లుడివి నువ్వా? ముందు నాకోసం ఏమేం కొన్నారో మీ నాన్ననడుగు... హిహిహి..." హుషారుగా అన్నాడు.

"హుంహుంహుహు...." చీరని మరింత నోట్లోకి దోపుకుంటూ కుమిలి పోయింది అండాళ్ళమ్మ.

"అమ్మా...నువ్వు చీరంతా నోట్లోకి దోపేస్కున్నావే..." కంగారుగా అంది సరస్వతి.

అండాళ్ళమ్మ ఓసారి తనవంక చూస్కుని కాస్సేపు సిగ్గుతో చచ్చిపోయి మళ్ళీ బితికి లోపలికి పరుగెత్తి చీర కట్టుకుంది.




ఆ రెండురోజులూ ఆనందరావు మాంగారూ, అత్తగారూ ఇంట్లోని ఇబ్బందులు గురించి కొన్ని అల్లుడుతోనూ, కొన్ని వాళ్ళిద్దరూ అల్లుడికి విన బడేలాగు మాట్లాడుకున్నారు.

కానీ ఆనందరావు ఏమాత్రం కరగలేదు.

దీపావళి రోజు ఉదయం అల్లుడికి కాఫీ అందిస్తూ అంది అండాళ్ళమ్మ–

"చూడు నాయనా... ఈ చీర చూశావా అన్నీ అతుకులే... పండగపూట కట్టుకుందామంటే ఓ మాంచి చీర లేదు. ఏం చేస్తాం నాయనా అంతా నా ఖర్మ..."

అప్పుడే అక్కడికి వచ్చిన పరబ్రహ్మాం భార్య మాటలు విని ఛగ్గున మండిపడ్డాడు.

"చీరలు లేకపోవడం ఏమిటి?..." దీపావళి పండక్కి నీకు వెయ్యిరూపాయలు పెట్టి కొత్తచీర కొన్నానే!... అదేం చేశావ్... కొంపతీసి దాన్ని స్టీలుసామాన్లవాడి కేసేశావా?" అండాళ్ళమ్మ నెత్తి కొట్టుకుంది.

"మీ తెలివి తెల్లారినట్లే వుంది... ఎక్కడి మట్టిబుర్ర దొరికిందండీ నాకూ... మీరు నాకు చీరెక్కడ కొన్నారు... ఎంత ఇబ్బందితో చస్తున్నాం మనం?" అంటూ అల్లుడిని చూపించి కన్నుకొట్టి నాలుక పక్కలకి ఆడించింది.

పరబ్రహ్మాం నెత్తిమీద ఠకీమని ఒకసారి మొట్టికాయ వేస్కుని నాలుక కొరుక్కున్నాడు.

"అవును కదూ... హి హి హి... మొన్న నీకు వెయ్యిరూపాయలు పెట్టి చీర కొన్నట్టు కలా

చ్చింది. నేనింకా నిజంగానే నీకు చీర కొన్నానని అనుకుంటున్నాను. అంత డబ్బు మనకెక్కడిదీ... మనకెంత ఇబ్బందో" అన్నాడు.

"ఊఁ.. ఊ! మీరు కన్నుకొట్టడం నాలిక ఊపడం అన్నీ చూశాను... అవేం నా దగ్గర చెల్లవు గానీ నేను మంచం ఎక్కుతాను" కుర్చీ లోంచి లేస్తూ అన్నాడు ఆనందరావు.

"ఎందుకు నాయనా... ఇప్పుడేగా నిద్రలేచి మొహం కడుక్కుని స్నానం చేశావ్?" ఆశ్చర్యంగా అడిగింది.

"ఇపుడు మళ్ళీ నిద్రపోడానికి కాదు... అలగ డానికి. అలకపాన్పు ఎక్కుతున్నానన్న మాట!!... నా అలక తీర్చడానికి నేనేదడిగితే మీరది ఇవ్వా లన్నమాట."

"ఉహుంహుంహు..." చీర నోట్లో దోపుకో సాగింది అండాళ్ళమ్మ.

ఆనందరావు అలకపాన్పు ఎక్కాడు కొత్త అల్లుడిలా. ఎవరూ పట్టించుకోలేదు.

"మీరిలా పట్టించుకోకపోతే నేను చాలా పెద్ద కోరిక కోరి మీకు పనిష్మెంటివ్వాల్సి వస్తుంది?" మంచంమీంచి గావుకేక పెట్టాడు.

ఇది మరీ డేంజర్‌లా వుందే అనుకుని భయ పడి పరుగున అతని దగ్గరకి వెళ్లి ఏం కావాలని అడిగారు అత్తగారూ, మామగారూ.

"నాకు ఉంగరం కావాలి..." అన్నాడు.

"ఉంగరం కావాలి... అంతేకదూ?" సూటిగా అడిగాడు పరబ్రహ్మాం.

"అవును."

"మళ్ళీ మేం ఉంగరం పెట్టాక నేను ఇదేం అడగలేదు అనకూడదు."

"ఎందుకంటానూ... హాయిగా తీస్కుంటా" అన్నాడు ఆనందరావు.

పండగైపోయింది. ఆనందరావు, సరస్వతి ఊరికి బయల్దేరడానికి సిద్ధంగా వున్నారు.

"ఇదిగో అల్లుడూ ఉంగరం?" వేలికి తొడుగు తూ అన్నాడు పరబ్రహ్మాం.


ఉంగరం చూసి ఆనందరావు కెవ్వుమన్నాడు.


"ఏంటిది?"

"నువ్వు ఉంగరం కావాలని అన్నావుగానీ బంగారపు ఉంగరం అన్లేదు కదా అల్లుడు. దీంతో నీ మొదటి పండగలన్నీ అయిపోయాయి. ఇహ నీకు పండగలకు మర్యాద చెయ్యక్కర్లేదు."


ఆనందరావు బేర్ మన్నాడు.

# మరుపానందం









—మతిమరుపు స్పెషల్—

# సుందరీ-సుబ్బారావు

(ఓ మతిమరుపు జంట)


ఎన్.వి.ఎస్.నాయుడు

9246837689


హడావుడిగా సుబ్బారావు స్కూటర్ స్టార్ట్ చేస్తూంటే...

"ఏవండీ....." పిలిచింది సుబ్బారావు భార్య సుందరి.

"నువ్వింకా అక్కడే ఉండి ఏంచేస్తున్నావే..? తొందరగా రా... అసలే నా ఫేవరేట్ హీరో సినిమా... టైటిల్స్ దగ్గర్నుంచీ చూడకపోతే ఉప్మాలో కరివేపాకు మిస్సయినట్టుంటుంది."

"ముందు మీరా తాళం ఇస్తేగా... నేనిక్కడ తలుపుకి తాళం వేసి వచ్చేది.." అంది సుందరి సాగతీస్తూ.

"అయ్యో....దే...వు...డా....! ఇందాక నీకే ఇచ్చాను కదే...!!" అన్నాడు సుబ్బారావు విసుక్కుంటూ.

"నాకెక్కడిచ్చారు? కావలిస్తే చూసుకోండి." అంటూ చేతులూపింది.

స్కూటర్ ఇంజన్ లాక్ చేసి ఇంట్లోకెళ్ళి ఇళ్లంతా వెదికి "ఇంట్లో లేవు.. ఒకసారి చూడవే నీ దగ్గరే ఉండి ఉంటాయి." అన్నాడు లోపల్నుంచే. సుందరికి అనుమానమొచ్చి 'పాపం ఇందాక ఈయన నాకే ఇచ్చినట్టున్నాడు కదా' అనుకుంటూ హేండ్ బ్యాగ్ చూసింది.

తాళం కని పించదంతో- "అయ్యో... మీ మతిమరుపు మండా తాళం చెవి మీ స్కూటర్కే తగిలించారు కదండీ" అంటూ అందంగా అబద్ధం ఆడేసింది.

"అవునా! అక్కడే ఉందా సరే... సరే.... త్వరగా తాళం వేసేయ్... టైం ఎంతో లేదు..." అంటూ కంగారుగా బయటకొచ్చి స్కూటర్ స్టార్ట్ చేయసాగాడు.

ఇంతలో సుందరి ఇంటికి తాళం వేసేసి వచ్చి స్కూటర్ వెనకసీట్లో కూర్చుంది.

సుబ్బారావు స్కూటర్ కిక్ కొట్టీ...కొట్టీ... ఎంతకీ స్టార్ట్ కాకపోవడంతో- "ఒకసారి దిగవే దీన్ని వంచి ట్రై చేస్తాను" అన్నాడు ఆయాస పడిపోతూ.

"ఏమిటీ వంచి చూసేది... ముందు ఇంజన్ తాళం తీసారో లేదో చూడండి.." అంది సుందరి అనుమానంగా.

"అవును దీని తాళం ఏదీ..? సుందూ... నీతో ఎప్పుడు ప్రయాణం పెట్టుకున్నా ఇదే జంఝాటం సుమీ."

"మీరు తాళం ఎక్కడో పెట్టి మర్చిపోయి మధ్యలో నన్నంటారేమిటీ... నేనేం చేసాను...? ఇందాక ఇంట్లోకెళ్లారు కదా... అక్కడ వది లేసారేమో.. అసలే మీకీమధ్య మతిమరుపు ఎక్కువైపోయింది" అంది అక్కడికి తనకేదో తక్కువైనట్టు.

సుందరి 'మీకు మతిమరుపు ఎక్కువైపోయిందంటూ దెప్పడంతో కోపం వచ్చి ఇంటి తాళం తీసి వెదుకుదామని వెళ్ళి చూసేసరికి సుందరి ఎప్పటిలాగే ఇంటికి తాళం వేసింది... కానీ గొళ్లెం మర్చిపోయింది.

"సుందరీ నీ నిర్వాకం చూసావా....తాళం వేసావు?గొళ్లెం మర్చిపోయావ్..." కాసేపు దాస్ చేసాడు సుబ్బారావు అవకాశం దొరకడంతో.

"అయ్యో! సారీ అండీ...ఏవండీ...ముందు మీరా స్కూటర్ తాళం సంగతి చూడండి... అసలే టైమెంతో లేదు కదా.... టిక్కెట్లు దొరుకుతాయో లేదో.. ? అంది గారంగా సుబ్బారావు వీక్నెస్ మీద బలంగా ఓ దెబ్బ కొడ్తూ.


"అవునవును!" అంటూ తలుపు తీసి తనకిష్ట దైవమైన మమస్వామిని (మతి మరుపేశ్వర స్వామి) 'దేవుడా..! త్వరగా స్కూటర్ తాళం కన పడేలా చూడు స్వామీ...ఈసారి మర్చిపోకుండా నీకేదొకటి చూస్తాను' అంటూ నోట్లోనే గొణుక్కుని లోనికి వెళ్ళి కళ్లతో ఇళ్ళంతా స్కాన్ చేస్తూండగా ఫ్రిజ్ మీద స్కూటర్ తాళం కనిపించింది?.

'హమ్మయ్య బతికించావు దేవుడా... నామొర ఆలకించావు స్వామీ' అనుకుని, ఇంటి తలుపుకి మర్చిపోకుండా గొళ్ళెం పెట్టి తాళం వేసి గట్టిగా మూడుసార్లు లాగి "పదవే సుందూ" అంటూ స్కూటర్ స్టార్ట్ చేసి రయ్యిమంటూ పోనిచ్చాడు.

✦ ✦ ✦

సుబ్బారావు జనాల్ని తోసుకుంటూ వెళ్ళి కష్టపడి ఓ రెండు టికెట్లు సంపాదించి-"సుందూ నువ్వు పదవే ...నేను స్కూటర్ పార్క్ చేసి వస్తాను" అంటూ సుందరికో టికెట్ ఇచ్చి తను స్కూటర్ పార్కింగ్ చేయడానికి వెళ్ళాడు.

ఇంతలో "అరేయ్ సుబ్బా నువ్విక్కడా...!" ఆశ్చర్యంగా అడిగాడు చిన్నప్పటి ఫ్రెండు పాన కాలరావు.



"థియేటర్లో కనిపించినవాడిని నువ్విక్కడున్నావేంటని ఆశ్చర్యం గా అడిగితే ఏంచెప్తాడు...సినిమాకి వచ్చుంటాడు" అన్నాడు పానకాలరావుతో పాటు వచ్చిన ఫ్రెండు.


"ఆఁ... అవునురా... సినిమాకి వచ్చాను.....మరి మీరు??"

"మేమూ సినిమాకే కాకపోతే ఒక టిక్కెట్టే దొరికిందిరా"

"అయ్యో! అలాగా పాపం! ఓ పని చేయ్... ఈ టిక్కెట్టు తీసుకుని మీరు వెళ్ళండి... నేను తర్వాత వెళ్తాలే" అన్నాడు సుబ్బారావు.

"వద్దులేరా... పాపం నువ్వు ఎంత కష్టపడ్డావో ఈ టిక్కెట్టు కోసం" అన్నాడు పానకాలరావు

"ఫరవాలేదురా మీరు వెళ్ళండి...మీరేమో ఇద్దరున్నారు... టిక్కెట్టు చూస్తే ఒకటే ఉంది... బ్లాకులో కూడా దొరికేలా లేవు" అన్నాడు సుబ్బారావు తను సుందరితో పాటు వచ్చిన సంగతి మర్చిపోయి.




ఇక వచ్చిన అవకాశాన్ని వదులుకోకూడదన్నట్టు టిక్కెట్టు తీసేసుకుని "థాంక్స్ రా... బై..." అంటూ సినిమాకి వెళ్ళిపోయాడు పానకాలరావు వాళ్ళ ఫ్రెండుతో.

"ఓకేరా బై.." అంటూ సుబ్బారావు స్కూటర్ అక్కడే మర్చిపోయి థియేటర్ బయటకు వచ్చేసి లెఫ్ట్....రైట్ స్టార్ట్ చేసి నడుచుకుంటూ వెళ్తున్న తన్ని ఆపి ఇంతకుముందే పరిచయమున్న వాడిలా- "అరేయ్ పప్పూ!" అంటూ పిలిచాడు.

అతను 'ఎవరా?' అన్నట్టు చూసాడు సుబ్బారావు వైపు.

"అరేయ్ నేనురా! మరిచిపోయావా.. నీ మతిమరుపు జబ్బు ఇంకా తగ్గినట్టు లేదు.. వెధవా.. అరవై అయినా బాడీ భలే మైంటైన్ చేస్తున్నావురా.... మనం కలిసి చాలా రోజులైంది కదూ? పదరా... అలా హోటల్ కెళ్లి మాట్లాడుకుందాం" అంటూ అతను ఏదో చెప్పాలని ప్రయత్నిస్తున్నా, చెప్పనీకుండా బలవంతంగాహోటల్‌కి తీసుకెళ్లి

"ఏం తింటావ్..?" అడిగాడు.

"నాకేమీ వద్దు.. నాపేరు పప్పూ...." అంటూ అతను ఏదో చెప్తూండగా...

"నీకు వెధవ మొహమాటమింకా పోలేదు సరే... నేనే ఆర్డరిస్తాలే" అంటూ మెనూ తీసుకుని వెయిటర్‌ని పిలిచి నోటికొచ్చినవి ఆర్డర్ ఇచ్చేసి..

"ఇంకేమిటిరా పప్పూ కబుర్లు... అన్నట్టూ... అప్పుడు బుచ్చమ్మని బూరిగాడు పెళ్లి చేసేసుకున్నాడా... వదిలేసాడ్రా...!?"

"బుచ్చమ్మ... బూరిగాడా... !" అడిగాడతను ఆశ్చర్యంగా.

"యిహే?..అప్పుడు వాళ్ళిద్దరి మధ్య రాయబారం నడిపింది నువ్వే కదేటీ...!" అన్నాడు పళ్ళికిలిస్తూ.

"నేనా...?" 'వీడెవడ్రా బాబూ....చెప్తుంటే వినడు. మాట్లాడనివ్వడు.....అయినా పొద్దున్న గోల టీవీలో జాతకరత్న మిడతంబొట్లు గుడ్లు మిటకరిస్తూ మరీ 'ఈ రోజు మూల నక్షత్రంలో పుట్టినవాళ్ళు ఓ అపరిచిత వ్యక్తి చేతిలో మోసపోతారు అని చెప్పకనే చెప్పాడు... వీడు దేని కెసరు పెడతాడో' అనుకుంటూండగా ఆర్డరిచ్చినవి ఒక్కొక్కటే వస్తూంటే సుబ్బారావు తిని పెడుతూ మధ్యమధ్యలో తనని కూడా తినమని బలవంతపెట్టసాగాడు.

తినడం... త్రేన్చడం అయ్యాక "ఓకేరా.. పప్పూ! వెళ్దామా" అంటూ సుబ్బారావు బయలు

దేరడంతో "హమ్మయ్య" అనుకుంటూ అతనూ బయలు దేరాడు.

ఇంతలో "సార్..." అని పిలుపు వినిపించి-

"ఎవరూ?" అంటూ వెనక్కు తిరిగాడు సుబ్బారావు.


"నేను సార్... వెయిటర్‌ని"

"వీళ్ళొకళ్ళు... టిప్పిచ్చేదాకా వదలర్రా వప్పూ....." అని "ఏమిటీ టిప్పా ?" అడిగాడు సుబ్బారావు.

ఫుల్లుగా మెక్కేసి మెల్లగా జారుకుంటున్నార న్నట్టు ఓ చూపు చూసి "టిప్పు కాదు బిల్లు" అన్నాడు వెయిటర్.

"ఓహ్.. సారీయార్... మాటల్లో పడి మర్చి పోయాను" అంటూ పర్స్ తీసాడు సుబ్బారావు...

కానీ ఖాళీ పర్స్ వ్వె..వ్వె..వ్వె అంటూ వెక్కిరించింది.




కానీ సుబ్బారావు మాత్రం కెవ్వుమనకుండా-

"అరేయ్ వప్పూ! నా దగ్గర చిల్లర లేదుగానీ బిల్ నువ్విచ్చేయరా! మనం తర్వాత కలుద్దాం." అంటూ కంగారుగా అక్కడ్నుంచి జారుకున్నాడు

'అయ్యింది.. అనుకున్నంతా అయ్యిందిరా దేవుడో....' లబోదిబో మంటూ బిల్లు పే చేసాడు వప్పు అనబడే ఆ అపరిచితుడు.

సుబ్బారావు గబగబా ఆటో ఎక్కేసాడు.

◆ ◆ ◆

సుబ్బారావు....మరొకావిడ తప్ప విరాట్ నగర్ వచ్చేసరికి అందరూ ఆటో దిగి పోయారు.

"సార్ మీరెక్కడకెళ్ళాలి?"


సడన్‌గా ఆటోవాడలా అడిగేసరికి తను ఎక్క డికి వెళ్ళాలో గుర్తుకురాక "ఇంతకీ ఈ ఆటో ఎక్కడివరకూ వెళ్తుందో...!" అన్నాడు తన మతి మరుపుని మేనేజ్ చేసే ప్రయత్నంలో.

"సింహాచలం వరకూ" అన్నాడు ఆటోవాడు.

"సరే పద.. అక్కడివరకూ వచ్చేస్తాను" అన్నాడు సుబ్బారావు.

"ట్రాఫిక్ జామైనట్టుంది.." అంటూ ఆటో దిగి వెళ్లి తెలుసుకుని వచ్చి " సార్.. ఈ ట్రాఫిక్ ఇప్పుడు క్లియర్ అయ్యేలా లేదు... ఎవరో పిల్లా డిని ఇంట్లో వదిలేసి తాళం పెట్టి వెళ్ళిపోయా రంట... పిల్లాడు అదేపనిగా ఏడుస్తు న్నాడంట...చుట్టుప్రక్కల జనాలు......ఒక అర డజన్ న్యూస్ చానల్స్ లైవ్ ప్రోగ్రాంతో అక్కడ చాలా హడావుడిగా ఉంది" అన్నాడు.

"అరే... అలాగా! ఏంచేస్తాంలే. జనాలలా తయారయ్యారు...... అయినా ఈ కాలం తల్లి తండ్రులకు పిల్లలు భారమైపోయారు. వాళ్ళని ఇంట్లో వదిలేసి వీళ్ళు బలాదూర్ తిరుగు తుంటారు..." అన్నాడు ప్రక్కనే కూర్చున్నామెను చూస్తూ...




సుబ్బారావు మాటలేమీ పట్టించుకోకుండా

"బాబూ! అయితే ఈ ఆటో ఇకముందు కెళ్ళదా?" అడిగిందావిడ.

"లేదమ్మా! ఇక్కడ దిగిపోండి.. నేను వెనక్కి వెళ్ళిపోతాను..." అనగానే ఆవిడ దిగిపోయి ఆ హంగామా ఏమిటో చూద్దామని అటువైపు వెళ్ళింది.

చేసేది లేక సుబ్బారావు కూడా దిగిపోయి అటువైపే వెళ్ళాడు.

రెస్క్యూ టీంవాళ్ళు కిటికీ గ్రిల్ కట్ చేసి బాబుని బయటకు తీసుకొచ్చి అపార్ట్‌మెంట్ ప్రెసిడెంట్ పాపారావు చేతిలో పెట్టి ఇదే లాస్ట్ అండ్ ఫైనల్ మరోసారి ఇలా జరిగితే ఊరు కునేది లేదంటూ వార్నింగిచ్చి వెళ్ళిపోయారు.

పాపారావు ఉక్రోషం ఆపుకోలేక సుబ్బారావు తో పాటు చోద్యం చూస్తున్నావిడ దగ్గరకొచ్చి-

"మీతో గొప్ప చిక్కొచ్చి పడుతోంది. ప్రతీసారీ ఏదో ఒక తంటా తెచ్చిపెడ్తున్నారు" అన్నాడు.

"మేమా !?" అడిగారిద్దరూ ఒకరి మొఖాలు ఒకరు చూసుకుని.

"ఆఁ... మీరే.!" అన్నాడు పాపారావు.

"ఆవిడకూ నాకూ లింకు పెడుతున్నా రేంటీ? మీరు భలేవారులా ఉన్నారే చూస్తుంటే..." అన్నాడు సుబ్బారావు.

"ఓర్నీ! మళ్ళీ ఇదో ట్విస్టా..." వాచ్ మేన్ని పిలిచి "అరేయ్ వీళ్ళిద్దరిదీ ఫోటో తీసుకురారా బాబూ."

వాచ్ మేన్ ఫోటో తీసుకొచ్చి చూపించగానే–

"సుందూ! నువ్వేనా!" అంటూ సుబ్బారావు.

"ఏమండీ మీరేనా... నన్ను వదిలిపెట్టి ఎక్కడికి వెళ్ళిపోయారండీ.... థియేటర్లో మీరను కుని అతన్నెవరినో వ్వా...వ్వా...వ్వా.. " అంటూ వెక్కివెక్కి ఏడ్వటం మొదలు పెట్టింది


"అయ్యో... ఎంత పనైపోయింది సుందరీ" అంటూ ఒకరినొకరు పట్టుకుని ఏడ్వటం మొదలు పెట్టారు.

"మీ ఫామిలీ డ్రామా తర్వాత. ముందు వీడి సంగతి చూడండి.." అన్నాడు పాపారావు.

"వాడి సంగతి అక్కడే చూసానుగా ఇంకెవడి సంగతీ..." అంది సుందరి సాగతీసుకుంటూ

పాపారావు తలపట్టుకుని 'వీళ్ళ ఫోటోల ఆల్బమ్ మైంటైన్ చేయలేక చచ్చిపోతున్నాం',

"అరేయ్ వీళ్ల ముగ్గురిదీ ఉన్న ఫోటో కూడా




చూపించరా బాబూ" అనడంతో సుందరి వాచ్ మేన్ దగ్గర ఫోటో తీసుకుని చూసి "ఏవండీ వీడు మన చచ్చూ గాడండీ..." అంది.

సుబ్బారావు కూడా ఫోటో చూసి "అవునే..! వీడు మన చచ్చూగాడేనే..!!" అంటూ పాపారావు చేతుల్లోంచి చచ్చూని తీసుకున్నాడు.

ఇంతలో న్యూస్ చానల్స్‌లో లైవ్ చూసి కంగారు పడి సుందరి.. సుబ్బారావుల కొడుకూ... కోడలు అక్కడికి వచ్చారు.

సుబ్బారావు దగ్గర్నుంచి పిల్లాడిని లాక్కుని "పిల్లాడిని మళ్ళీ మీదగ్గర వదిలితే ఒట్టు .. ఒకవేళ వదిలితే నా చెప్పు తీసుకుని కొట్టు..." అన్నాడు సుబ్బారావు కొడుకు సీరియస్‌గా.

"అయినా వీళ్ళిలా ఎన్నిసార్లు చేసినా వీళ్ళని నమ్మకోవడం మనదే బుద్ధి తక్కువలెండి. పదండి... మనం ఆఫీస్‌కి వెళ్ళేటప్పుడు వీడిని ఎక్కడో క్రెచ్ లో వదిలి వెళ్లదాం" అంది సుబ్బారావు కోడలు ఇద్దర్నీ అదోలా చూస్తూ.

సుబ్బారావు కొడుకు, కోడలు పాపారావుకి థాంక్స్ చెప్పి అక్కడ్నుంచి వెళ్లిపోయారు.

సుందరీ–సుబ్బారావులు ఒకరి మొఖాలొకరు చూసుకుంటూ అపార్ట్‌మెంట్ ప్రెసిడెంటు పాపారావుని ప్రక్కకు పిలిచి–

"ఎవరు సార్ వీళ్ళు?" అని అడిగారు.

"చూడరా వీళ్ళు ఇది వాళ్ళ ఇల్లుకాదనుకుని మరలా ఎక్కడకో పోయినా పోతారు" అన్నాడు ప్రెసిడెంట్ పాపారావు.

"అలాగే సార్" అంటూ వాళ్ల దగ్గరున్న తాళాలు తీసుకుని ఇంటి తాళం తీస్తూ –

"సార్ ఇంతకీ మీ స్కూటర్ ఏది?" అన్నాడు వాచ్‌మేన్.

"అవును స్కూటరేది...!?....ఇంతకీ నువ్వెవరు..." అంటూ ఎదురు ప్రశ్నించడంతో వాచ్ మేన్ జుట్టు పీక్కుంటూ పారిపోయాడు.

"పాపం తనెవరో మర్చిపోయినట్టున్నాడు" అన్నాడు సుబ్బారావు.

'అవును పాపం' అన్నట్టు చూసింది సుందరి.



## కొలపల్లి ఈశ్వర్ సీరియల్




"నేను ఆత్రంకొద్దీ అలా అనుకోలేదులెండి..." అంది రుద్రమ సర్రున మూతి బిగిస్తూ.

"మరి ఎందుకనుకున్నట్టో?" కాస్త వ్యంగ్యంగా అన్నాడు చిట్టిబాబు.

"ఎందుకో ఒకందుకు అనుకున్నాను. మనసులో అనుకున్న వాటినికూడా మీకు సంజాయిషీ చెప్పాలా?" కాస్త చిరాగ్గా అంది రుద్రమ.

"నేను నిన్నేం సంజాయిషీ అడగటంలేదు... వున్న విషయం చెబుతున్నాను..."

"ఏది వున్న విషయం? అలాంటి ఆత్రం ఏమైనా వుంటే గింటే మీకే వుంటుందిగానీ నాకేంలేదు. నేనసలు ఇపుడీ శోభనం జరక్కపోయినా ఏం పట్టించుకోను... అదేమాటని మీరనగలరా?"

ఆమె సవాలు విసురుతున్నట్టు అలా అనేసరికి కన్ఫ్యూజ్ అయిపోయాడు చిట్టిబాబు.

ఊఁ అంటే... అయితే, శోభనం కాన్సిల్ అంటుందేమో?!

ఊహూఁ!... తానోడిపోయినట్టు అవుతుందేమో?!

తొలిరాత్రే భార్యముందు ఓడిపోవటం ఏమిటి?

పౌరుషం లాంటిదేదో పొడుచుకు రాగా,

"ఏం? ఎందుకనలేనూ?!" అని అనేశాడు చిట్టిబాబు అప్రయత్నంగా.

"అయితే ఇహనేం? శోభనం లేదు, గీభనం లేదు... ఆ మిగిలిన పాలుకూడా మీరే తాగేసి హాయిగా బజ్జోండి..." అనేసింది రుద్రమ నవ్వేస్తూ.

'ఏదో అన్నాడే తప్పు... అది ఈయనవల్ల అవుతుందా? గురుడు గిలగిల్లాడిపోడూ?' అనుకుంది మనసులో.

అది చిట్టిబాబుకి తెలిసిపోకుండా ఎలా వుంటుంది?

"ఏం గిలగిలాడ్డిపోను! నాకూ్కడా నిగ్రహశక్తి వుందని నిరూపిస్తాను. అయినా, నీకు లేని ఆత్రం నా ఒక్కడికే ఎందుకుండాలి?" అనుకున్నాడు బెట్టుగా.

"సరే... అలాగే, బజ్జుంటాలేగానీ, ఈ సగం పాలు మాత్రం నువ్వే తాగు... పద్ధతి ప్రకారం నువ్వే తాగాలి..." అన్నాడు పాలగ్లాసుని ఆమెకి అందిస్తూ.

"సరే..." అని నవ్వేసి చిటికెలో ఆ గ్లాసుని ఖాళీ చేసేసింది రుద్రమ.

ఖాళీగ్లాసుని తనే టీపాయ్‌మీద పెట్టి... "ఆ స్వీట్లూ, పళ్ళూ మాత్రం ఏం పాపం చేశాయ్? వాటినికూడా తినేసి ఎవరిమట్టుకు వారు బజ్జుందాం" అంది చిలిపిగా.

జరిగిన ఈ వింత పరిణామానికి కడుపు రగిలిపోతూవుంటే చాలా ఆకలిగా అనిపించి "సరే, అలాగే కానియ్" అన్నాడు చిట్టిబాబు వీరజవాన్‌లా!

ఫలితంగా వాళ్ళిద్దరూ కాసేపు తిండి కార్యక్రమంలో పడ్డారు.

'రంభలాంటి భార్య అందాన్ని కొరుక్కుతింటూ వుండాల్సిన సమయంలో... ఛ! ఈ తిండేంటి?' అనుకున్నాడు చిట్టిబాబు ఒకప్రక్క లాగిస్తూనే.

'చాలా బెట్టుప్రదర్శిస్తున్నాడుగానీ... కాసేపటికి... కాళ్ళబేరానికి రాకపోతాడా!' అనుకుంది రుద్రమ యాపిల్‌పండుని చిన్న చిన్నగా కొరుక్కుంటూ.

ఆమె అలా అనుకోవడం చిట్టిబాబు అహాన్ని దెబ్బతీసింది.

'అంటే... ఏవన్నట్టు లెక్క?'

"నేను మరీ అంత కాముకుడిననేగా ఆమె ఉద్దేశ్యం!' 'న్నో... నేను చచ్చినా కాళ్ళబేరానికి వెళ్ళను...' అనుకున్నాడు స్థిరంగా.

ఫలహార సేవనం అయ్యాక...

"నన్ను వెళ్ళి క్రిందపడుకోమంటారా?" అనడిగింది రుద్రమ.

"నువ్వెందుకూ క్రింద పడుకోవటం! నేనే పడుకుంటాన్లే!" అన్నాడు చిట్టిబాబు బెట్టుగా.

'కొంపదీసి కాళ్ళబేరానికి రాదా ఏమిటి?'

**జరిగిన కథ:** బస్టాప్‌లో బస్ కోసం ఎదురు చూస్తుండగా ఒక అందమైన అమ్మాయి చిట్టిబాబుని చూసి నవ్వుతుంది. ఆమె ఎందుకు నవ్వుతుందో అర్థం కాక ఎదుటి వాళ్ళు మనసులో అనుకున్నది తెలిస్తే ఎంతబాగుంటుందో అనుకుంటాడు. అలా అనుకోగానే ఎదుటివాళ్ళు అనుకుంటున్నవన్నీ చిట్టిబాబుకి తెలిసి పోతుంటాయి. తన చెల్లెలు పక్కింటి కుర్రాణ్ణి ప్రేమిస్తున్నట్టు తెలిసి, ఆ అబ్బాయితో మాట్లాడి, వాళ్ళిద్దరి పెళ్ళిగురించి పెద్దలతో మాట్లాడి వాళ్ళను ఒప్పిస్తాడు. బస్టాప్‌లో కనిపించిన అమ్మాయితో తన ప్రేమ విషయం చెబుతాడు. ఆ అమ్మాయి చిట్టిబాబు ప్రేమని అంగీకరిస్తుంది.
—ఇకచదవండి

అనుకుంది రుద్రమ మనసులో ఆందోళనగా.

"ఊహూఁ... నేనే క్రిందపడుకుంటా..." అంది పైకి.

"అమ్మాయిగారికీ లోలోన ఆత్రంగానే వుందయితే!' అని మనసులో అనుకుని...

"సరే నీ ఇష్టం!" అనేశాడు చిట్టిబాబు సింపుల్‌గా.

'ఛీ! ఏం మనిషి!' అనుకుంది రుద్రమ కోపంగా.

దాంతో సహజంగానే చిట్టిబాబుకి చిర్రెత్తుకొచ్చింది.

"నువ్వేగా బోడి సవాలు విసిరింది. ఛ! ఏం మనిషి అనుకుంటున్నావేంటీ?" అన్నాడు కోపంగా.

నిష్కారణంగా శోభనరాత్రి వృధా అయిపోతున్నందుకు అతనికెంత కోపంగా వుందో ఆ మెకీ అంతే కోపంగా వున్నందున-

"నా ఇష్టం! నా ఇష్టమొచ్చినట్టు అనుకుంటా నా మనసులో." అనేసింది రుసరుసలాడుతూ.

అలా రుసరుసలాడే బదులు "సారీ అండీ!" అనకూడదా అనుకుని "సర్లే నీ ఇష్టమొచ్చినట్లే అనుకో. ఎవరొద్దన్నారు?" అనేసి మంచంమీద వాలిపోయి దుప్పటి ముసుగు కప్పేసుకున్నాడు చిట్టిబాబు.

"ఓరి దేవుడోయ్! ఏమో అనుకున్నాను... ఎంత మొండిమనిషి!" అనుకొని, ఓ దుప్పటీ, దిండూ తీసుకుని నేలమీద పక్కపరుచుకుంది రుద్రమ.

దరిమిలా ఆ పక్కమీద ఒరిగి 'కాసేపటికైనా కాళ్ళ బేరానికి రాకపోడులే!' అనుకుందామె మనసులో మళ్ళీ.


ముసుగుని కొంచెం తొలగించి ఒంటి కంటితో ఆమెనే చూస్తోన్న చిట్టిబాబు 'చచ్చినా రాను... కాళ్ళబేరానిక్కాదుకదా...చేతుల బేరాని క్కూడా రాను...' అనుకున్నాడు బెట్టుగా.

'మొండిమనిషి, తిక్కమనిషి, మతిలేని మనిషి, ఎంతన్యాయంగా ఈ రాత్రిని వృధా చేస్తున్నాడో! తప్పు నాదేనేమో... అతన్నలా రెచ్చగొట్టి వుండాల్సిందికాదేమో... ఏదో మాటవరసకి అంటే మాత్రం మరీ ఇంత బెట్టుచెయ్యాలా? మరీ ఇంత మొండి పట్టుదల వుంటే ముందు ముందు ఈయనతో వేగటం కష్టమే... అసలీ మనిషి ఎలా నిగ్రహించుకో గలుగుతున్నాడబ్బా?...

ఇలా ఆమె రకరకాలుగా తన మనసులో అనుకోవడం ముసుగులో వున్న చిట్టిబాబుకి తెలుస్తూనే ఉన్నప్పటికీ... చచ్చినా ఓడిపోకూడదన్న దృఢనిశ్చయంతో అతను వాటిని పట్టించుకోకుండా మనసులో కుమిలి పోతూనే క్రమంగా నిద్రలోకి జారిపోయాడు.

ఫలితంగా... ఆ రాత్రి ఆ నూతన దంపతులిద్దరికీ చప్పగా తెల్లారి పోయింది.

◆ ◆ ◆



ది సెకండ్‌నైట్...

'ఈ రోజు ఎట్టి పరిస్థితుల్లోనూ మనసులో ఏం అనుకోకుండా బుద్ధిగా వుండాలి? ఆయన మాత్రం మెత్తబడి దగ్గరికి తీసుకున్నా మారు మాట్లాడకుండా ఆయన కౌగిట్లో ఒదిగి పోవాలి..?' అనుకుంటూ ఆ గదిలోకి ప్రవేశించింది రుద్రమ.

"వచ్చిందండీ అమ్మగారూ!' అనుకున్నాడు చిట్టిబాబు ఆమెని చూసి కోపంగా.

'ఒక అందమైన రాత్రి శోభనరహితంగా తెల్లారిపోతే ఏ మగాడికి మాత్రం ఒళ్ళు మండకుండా వుంటుంది?

అందుకే... "తనే వస్తుందిలే! నేనెందుకూ ఎదురేగి మంచందాకా తోడ్కొని రావటం?' అనుకొని ఎటో చూస్తూ కూర్చుండిపోయాడు చిట్టిబాబు.


'భలేమనిషి' అనుకుని తనే తలుపుకి గడియ వేసొచ్చి అతన్ని సమీపించింది రుద్రమ.

"నేను కూర్చోవచ్చా మీ ప్రక్కన?" అడిగింది మనసులో ఏం అనుకోకుండా... నిగ్రహించుకుంటూ.

"వైనాట్? కూర్చో..." అన్నాడు చిట్టిబాబు కాస్త పక్కకి జరుగుతూ.

దాంతో ఆమె అతని ప్రక్కన కూర్చుంది.

'అబ్బ! ఎంత అందంగా వుంది!' అని అనుకోకుండా వుండలేకపోయాడు చిట్టిబాబు... అనుకున్నాక...




"రాత్రి జరిగిందంతా మర్చిపోయి, ఇవ్వాళ్టి నుంచి మనం హ్యాపీగా వుందాం...సరేనా?" అన్నాడు ప్రేమగా.

"సరేనండీ!" అంది రుద్రమ.

"ఈ డేంజరస్‌ఫెలోతో మనసులో ఏమనుకున్నా ప్రమాదమే కాబట్టి ఇకనుండి మనసులో ఏమీ అనుకోకుండా హాయిగా జీవితాన్ని ఎంజాయ్ చెయ్యాలి" అనుకుంది మనసులో.

ఆమె మళ్ళీ తనని డేంజరస్ ఫెలో అనుకుంటుంటే చిట్టిబాబు మామూలుగా ఎలా వుండగలుగుతాడు?

సహజంగానే అతని ముఖం నిన్నటిలాగే మాడిపోయింది.

అబగా, ఆత్రంగా తనని దగ్గరికి తీసుకుంటాడని ఆశిస్తే అతనలా ముఖాన్ని మాడ్చుకోవటం రుద్రమకి చాలా నిరుత్సాహాన్ని కలిగించింది.

ఆ కోపంతో... ఆ నిరుత్సాహంలో... క్షణం క్రితం తాను తీసుకున్న నిర్ణయాన్ని మర్చిపోయి, గబుక్కున 'ఛీ! ఏం మనిషి బాబూ!' అనుకుంది మనసులో.

ఆ అనుకోడం చిట్టిబాబుకి తెలిసిపోయి... అతని ముఖం మరింతగా మాడిపోయింది.

అదిచూసి... "ఎందుకలా ముఖం మాడ్చుకున్నారు?" అంది రుద్రమ కోపంగా ఏమీ ఎరగనట్టు.

"ఛీ! ఏం మనిషిబాబూ! అని నువ్ అనుకుంటుంటే ముఖం మాడదా?" ఆవేదనగా అన్నాడు చిట్టిబాబు.


'ఇదెక్కడిగోలరా భగవంతుడా!' అనుకుంది రుద్రమ మనసులో.


"నేనేం అలా అనుకోలేదు" అంది పైకి మాత్రం బుకాయింపుగా.

అతని దగ్గర అలాంటి బుకాయింపులు పని చేయవని ఆ క్షణాన్న ఆమెకి అనిపించలేదు.

"ఎందుకు రుద్రమా! అబద్ధాలాడ్తావ్?" అన్నాడు చిట్టిబాబు బాధగా.

"నేనేం అబద్ధాలాడ్డంలేదు" అంది రుద్రమ






మరింత బుకాయింపుగా.

'నేరకపోయి చేసు కున్నానీ మహానుభావుడిని' అనుకుంది మనసులో.

"నేరకపోయి చేసుకోవడం ఏంటి?... అన్నీ తెలిసే చేసుకున్నావుగా?" అన్నాడు చిట్టిబాబు కోపంగా.

"అవునవును... తెలిసి తెలిసే ఈ ఊబిలో దిగాను..." చిరాగ్గా అంది రుద్రమ.

ఆమె మాటలకి చిట్టిబాబు ముఖం మరింతంగా మాడిపోయింది.

"ఎంతమాటన్నావు రుద్రమా?" అన్నాడు ఉక్రోషంగా.

అవునుమరి, ఎంతగానో ప్రేమించి పెళ్ళి చేసుకుంటే, ఆమె తనతో సహజీవనాన్ని ఊబిలో దిగటంతో పోలుస్తుంటే ఎవరికి మాత్రం ఉక్రోషం కలక్కుండా వుంటుంది?

"ఎంత మాటేముంది? ఉన్నమాటే అన్నాను. మీరు పద్దాక నా మనసుని చదివేసి నానా రాద్ధాంతం చేస్తుంటే ఇంక మనం సంసారం ఎలా చేసేట్టు? మన సంసారం ఎలా సాగేట్టు?" అసహనంగా నుదురు చిట్లించింది రుద్రమ.

"నువ్ నీ మనసులో నా గురించి చెడ్డగా అనుకోకుండా వుంటే సరి!"అన్నాడు చిట్టిబాబు తేలిగ్గా.

"అనుకోకుండా ఎలా వుండగలను?" ఎదురు ప్రశ్న వేసింది రుద్రమ.

"అంటే ఏంటి? నువ్ పద్దాక నీ మనసులో నా గురించి చెడ్డగా అనుకుంటూనే వుంటావా?" ఉక్రోషం ద్విగుణీకృతం కాగా పిడికిళ్ళు బిగించాడు చిట్టిబాబు.

"మరీ పిడివాదంగా మాట్లాడకండి. నేను మీ గురించి చెడ్డగా అనుకుంటున్నదేం లేదు. అన్నీ వున్నమాటలే అనుకుంటున్నాను. ప్రేమామృతాన్ని పంచి ఇవ్వాల్సిన ఘడియల్ని అతనా వృథా చేసేస్తున్నందుకు చిర్రెత్తిపోయి అతనివంక తీక్షణంగా చూసింది రుద్రమ.

"ఉన్నమాటలా?..." మరింత ఉడికిపోతూ అన్నాడు చిట్టిబాబు.

"నిస్సందేహంగా వున్నమాటలే! మీయంత ప్రమాదకరమైన మనిషి ఈ ప్రపంచంలోనే ఉండదసలు..." తిరస్కారంగా అంది రుద్రమ.

మనసు గాయపడిన మనిషికి వలపేం గుర్తుకొస్తుంది?

"ఛ!" అంటూ తలపట్టుకున్నాడు చిట్టిబాబు.

"మ్చ్... మ్చ్...'లతో హోరెత్తించాల్సిన తరుణాన్ని 'ఛీ... ఛ...'లతో మొగుడు వేస్ట్ చేసేస్తుంటే ఏ మగువ మాత్రం సహించగలుగుతుంది?

అందునా ఇంకా శోభనమే కాని మగువ.

"ఏం మొగుడు దొరికాడ్రా బాబూ!" అనుకుంది రుద్రమ విరక్తిగా.

ఆమె అనుకోవడం మరింత బాధ కలిగించగా టోటల్‌గా మూడాఫ్ అయిపోయింది చిట్టిబాబుకి.

ఆ తర్వాత ఏం జరిగిఉంటేనేం?


మొత్తానికా రాత్రి కూడా వాళ్ళ శోభనం వాయిదా పడిపోయింది.

* * *

ది నెక్స్ట్ డే...

"నిన్న జరిగిందంతా మర్చిపోయి ఈ రోజన్నా మనం హ్యాపీగా..." అన్నాడు చిట్టిబాబు ఆశ నిండిన గొంతుతో.

"నిన్న జరిగిందే కాదు... మొన్న జరిగింది కూడా మర్చిపోయి మీరున్నట్టే ఇవ్వాల హ్యాపీగా వుందాం. ఇవ్వాళొక్కరోజే కాదు... ఇకనుంచి జీవితాంతం హ్యాపీగానే వుందాం..." అంది రుద్రమ. **(సశేషం)**






# పరాకాష్ట అను రివర్సైన మతిమరపు

కోనే నాగవెంకట ఆంజనేయులు
9290660220

"చేతికి ఆ నల్లచుక్కేమిట్రా?"
"నల్లచుక్కా?"
"అవున్రా నల్లచుక్కే!"
"ఏ చేతికి?"
"కుడిచేతికి."
"కుడిచేతికా!... ఏమిటి కుడిచేతికి?"
"అదేరా! నీ కుడిచేతికి ఆ నల్లచుక్కేమిటని అడుగుతున్నాను."
"ఓ! అదా!"
"అదేరా!"
"అది మా ఆవిడ పెట్టిందిలే."
"మీ ఆవిడ పెట్టిందా? ఎందుకు పెట్టింది?"
"ఏమిటి ఎందుకు పెట్టింది?"
"అదేరా! నీ కుడిచేతికి మీ ఆవిడ ఆ నల్ల చుక్క ఎందుకు పెట్టింది అని అడుగుతున్నాను?"
"అది! అలా స్పష్టంగా అడిగితేనే కదా నాకు తెలిసేది?"
"సరే, చెప్పు."
"ఏమిటి చెప్పేది?"
"ఓరినాయనోయ్! నీ మతిమరపుతో చస్తున్నానా బాబూ"
"నాకు మతిమరుపని నీకెవరు చెప్పారు? అయినా నాకు మతిమరుపైతే... నువ్వెందుకు చావడం?"
"ఏదో మాటవరసకన్నాను లేరా! చెప్పు."
"ఏమిటి చెప్పేది?"
"అదేరా! నీ కుడిచేతికి మీ ఆవిడ ఆ నల్లచుక్క ఎందుకు పెట్టింది?"
"అదా! ఆవిడ యిచ్చిన ఉత్తరం నేను పోస్ట్ చెయ్యడం మర్చిపోతానేమోనని. అలా మరిచి పోకుండా వుండడానికని ఆవిడ ఆ నల్లచుక్క పెట్టిందన్న మాట."
"అదా విషయం! యింతకీ పోస్ట్ చేశావా?"
"ఏంటీ పోస్ట్ చెయ్యడం?"
"ఓరి దేవుడోయ్! చచ్చిపోతున్నానా బాబూ నీ మతిమరుపుతో... సారీ... సారీ... చచ్చిపోవడం లేదులే!"
"ఎందుకు చచ్చిపోవడం లేదు?"
"ఇంకా ఈ భూమ్మీద నా ఆయుష్షు మిగిలి వుంది కనుక. నీ దయవల్ల తొందర్లోనే పోతానేమో. ఇంతకీ మీ ఆవిడ నీకిచ్చిన ఆ ఉత్తరం పోస్ట్ చేశావా? లేదా?"
"ఏ ఉత్తరం? అయినా మా ఆవిడ నాకో ఉత్తరం యిచ్చిందని నీకెలా తెలుసు?"
"నువ్వేగా చెప్పావ్?"
"నేనెప్పుడు చెప్పాను?"
"దేవుడా! వీడి మతిమరుపుతో నాకు చావు... నర్లే! నేనెలా చస్తే నీకెందుకుగానీ... నీ జేబులో ఏదైనా ఉత్తరం ఉందేమో చూడు."
"ఏ జేబులో?"
"నీ చొక్కా జేబులోగానీ, నీ పాంట్ జేబులో గానీ...."
"చూశాను!... ఏ జేబులోనూ ఏ ఉత్తరమూ లేదే. యిప్పుడు చెప్పు ఎందుకలా అడిగావ్?"
"ఊ! యిది మాత్రం గుర్తుందే...!"
"ఏది గుర్తుందడం?"
"ఓరి నాయనోయ్! యిది యిలా తెగేది కాదు గానీ... మీ ఆవిడ ఫోన్‌నెంబరివ్వు.... ఫోన్ చేస్తాను."



"ఎవడ్రా నువ్వు? మా ఆవిడకి నువ్వెందుకిరా ఫోన్ చెయ్యడానికి?.... బద్మాష్! వుండాకోర్ నాయాలా!"
"ఒరేయ్! ఒరేయ్! ఆ తిట్టడం ఆపరా! మీ

ఆవిడ నాకు చెల్లి అవుతుందిరా."

"కాదని ఎవడన్నాడు? అయినా యిప్పుడెం దుకు మా ఆవిడకి నువ్వు ఫోన్ చెయ్యడం?"

"అదే! ఆ ఉత్తరం గురించి కనుక్కుందామని."

"ఏ ఉత్తరం గురించి? ఏం కనుక్కుంటావ్?"

"దేవుడా... దేవుడా... దేవుడా... యిలాంటి మతిమరుపు ఫ్రెండ్‌ని ఇచ్చావేంటి దేవుడా నాకు. ఇంతైనా కనికరం లేదా నీకైనా నామీద?"

"ఎవరికి నీమీద కనికరం వుండాలంటు న్నావ్?"

"ఎవరికోలే... యింతకీ ఆ ఉత్తరం పోస్ట్ చేశావా? లేదా?"

"చేశానేమో! లేకపోతే నా దగ్గిరే వుండా లిగా?"

"ఏమిటి నీ దగ్గరుండాలి?"

"అదేరా మా ఆవిడ నాకిచ్చి పోస్ట్ చెయ్యమని చెప్పిన ఉత్తరం."

"మీ ఆవిడ నీకు ఉత్తరం పోస్ట్ చెయ్యమని యిచ్చిందా?"

"అవును. అందుకే కదా మరిచిపోకుండా వుండడానికి చేతిమీద ఈ నల్లచుక్క పెట్టింది."

"నల్లచుక్కా? ఎక్కడ?"

"ఇదిగో నా కుడిచేతికి."

"నీ కుడిచేతికి మీ ఆవిడ నల్లచుక్క పెట్టిందా? ఎందుకు?"

"ఎందుకేమిట్రా? ఉత్తరం పోస్ట్ చెయ్యడం మరిచిపోకుండా వుండడానికి."

"ఏ ఉత్తరం? ఎందుకు పోస్ట్ చెయ్యడం?"

"దేవుడోయ్! నా మతిమరుపు వీడికి అంటు కుందిరోయ్."

"ఏవిటి అంటుకోవడం?"

✦✦✦


ఓరి నాయనోయ్! యింక నావల్ల కాదు తండ్రోయ్! ఈ మతిమరుపు భాగోతాన్ని సాగ దీయడం!


అసలు విషయం నేనే చెప్పేస్తున్నాను పాఠ కోయ్! వాళ్ళావిడ వాడి కుడిచేతికి చుక్క సింగా రించిన తరువాత వాడికి అసలు పోస్ట్ చెయ్యా ల్సిన ఉత్తరం యివ్వడం మరిచిపోయిందిరోయ్!

అదీ సంగతి!

# మరుపానందం







# మడిసికి... గొడ్డుకి తేడా....

బచ్చు సత్యనారాయణ

9290096736

భూలోకంలో.... అప్పుడే మానవులు జన్మించడం సంతతి పెరగడం మొదలైంది. ఆకలి దప్పులు కూడా మానవులు తెలుసుకుంటున్నారు.

స్వర్గంలో దేవతలంతా సమావేశమయ్యారు. బ్రహ్మదేవుణ్ని మిగతా దేవుళ్ళు- "స్వామీ... ఇంతమంది మానవుల్ని సృష్టించారు. మనకంటే ఎలాంటి ఆకలిదప్పులు వుండవు. మానవులు ఎలాంటి ఆహారం లేకుండా ఎంతకాలం జీవిస్తారు. వాళ్ళకంటూ ఏదైనా నిద్రాహారాలు... స్నానపానాదుల గురించి ఆలోచించండి" అని ప్రాధేయపడ్డారు.

వాళ్ళు చెప్పిందంతా విని నిజమే, మానవులకు అవసరమయ్యే కనీస అవసరాల గురించి ఆలోచించకుండా వాళ్ళను సృష్టించాను. మరి వాళ్ళ తిండితిప్పలు కూడా ఆలోచించాల్సిన బాధ్యత తనపై వుంది అనుకొని... దేవతలతో బ్రహ్మ-"అవును! వాళ్ళే పనులు లేకపోతే బాధ్యతలు అప్పగించకుంటే మానవులు యిలాగే ఏ పనీపాట లేకుండా జనాభా పెరుగుదలకు కారణమవుతారు. అందుకే నేనో పథకం ఆలోచించా" అన్నాడు.

"అదేమిటో సెలవీయండి స్వామీ" అందరు ముక్తకంఠంతో వేడుకున్నారు.

"మానవుడు నాగరికత తెలుసుకొని మర్యాద, గౌరవం, కష్టపడి పనిచేయాలి. అందరు సమానంగా బ్రతకాలంటే వాళ్ళంతా ముప్పూటలా స్నానపానాదాలు చేసి, దైవచింతనలో మునిగి రాత్రివేళ ఒక్కపూటే ఆహారం తినేలా చేస్తే... పగా, ద్వేషం, సోమరిపోతుతనం అసూయ, కామోద్రేకాలకు దూరంగా వుంటారు. అలా మెలగాలని ఎవరితోనైనా మానవులకు సమాచారం అందచేస్తే బాగుంటుంది. జనాభా పెరుగుదల కూడా తగ్గుతుందని నా ఆలోచన" చెప్పాడు బ్రహ్మ.

"బ్రహ్మాండమైన ఆలోచన స్వామీ! యీ సమాచారం మన నందీశ్వరుని ద్వారా మానవులకు అందచేస్తే మేలు జరుగుతుంది స్వామీ" అన్నాడు నారద మహర్షి.

అయితే, ఆలస్యమెందుకు, సత్వరమే అమలు పర్చండి నాథా" అంది సరస్వతీదేవి.

నందీశ్వరుని కోసం కబురు పెట్టారు.

కాసేపట్లో నందీశ్వరుడు బ్రహ్మముందు ప్రత్యక్షమయ్యాడు.

అతని రాక గమనించి, 'నందీశ్వరా! బ్రహ్మదేవుడు నీకో మంచి కార్యం చేయుడానికి యిక్కడికి పిలిపించారు" అన్నాడు నారదుడు.

"సెలవీండి స్వామీ! బ్రహ్మదేవుడి ఆజ్ఞ శిరసావహిస్తాను" తలూపుతూ నిలబడ్డాడు నంది.

"నందీశ్వరా! మీరు వెంటనే భూలోకం వెళ్లి మానవుల శ్రేయస్సుకై వారందర్నీ రోజు క్రమం తప్పకుండా, మూడుపూటలు స్నానం, జపం, దైవప్రార్థనలు చేస్తూ రాత్రి ఒక్కపూట మాత్రమే భోజనం చేయాలని, ఆదేశించి, రా నాయనా" ఆజ్ఞాపించాడు బ్రహ్మ.

నందీశ్వరుడు తక్షణమే స్వర్గలోకం నుండి భూలోక యాత్రకు బయలుదేరాడు.




◆◆◆

భూలోకంలో నంది అడుగుపెట్టగానే ప్రజలంతా ఏ పనులు చేయకుండా మధుపానాలు చేస్తూ వావివరుసలు లేకుండా శృంగార చర్యలతో... ఎప్పుడు నిద్ర, బద్ధకంతో అష్టదరిద్రాలతో, లెక్కకు మించి సంతానాన్ని కంటూ అస్తవ్యస్తంగా జీవనం సాగిస్తూ కనబడ్డారు.

ఇదంతా చూసి నందీశ్వరునికి మతిపోయి, చివరకు తానుకూడా మతిలేనివాడిలా ప్రవర్తించ సాగాడు.

తానొచ్చిన పని మర్చిపోయి, మానవుల కంటే

హీనంగా కనబడ్డ పశువుల వెంట తిరిగాడు, నానా గడ్డి తింటూ.

కొద్దిరోజుల తర్వాత, నంది ఓ చేలో గడ్డి మేస్తున్న ఆవుదగ్గరకు సరసా లడడానికి దగ్గరకెళ్ళాడు.

ఆ ఆవు తన వెనుక కాళ్ళతో బలంగా ఎగిరి తన్నింది.

ఆ దెబ్బకి తాను భూలోకానికి వచ్చిన పని మర్చిపోయినది గుర్తొచ్చింది.

అలా ఆవులా మారువేషంలో తన కర్తవ్యాన్ని గుర్తు చేయడానికి బ్రహ్మ దేవుడు పంపాడని మాత్రం నందీశ్వరుడు గ్రహించే స్థితిలో లేదు. అలా గుర్తొచ్చేసరికి ఆవు మాయమైంది.

అప్పుడు గుర్తుకు వచ్చింది యిది బ్రహ్మ చేసిన పనేనని.

వెంటనే నంది మనుష్యులందరి దగ్గరికెళ్ళి, తానెవరో తానొచ్చిన పనేంటో చెపుతూ బ్రహ్మ చెప్పింది మరిచిపోయి "మీరంతా నాగరికతలోకి అడుగుపెట్టాలంటే ప్రతీ మనిషి మూడుపూటలా తప్పకుండా తిండి తినాలి. ఒక్కపూట స్నానపానాదలు చేస్తూ, దేవుణ్ని పూజించాలి. యిది మిమ్మల్ని సృష్టించిన బ్రహ్మదేవుడి ఆజ్ఞ" అని చెప్పి మాయమయ్యాడు.

కొన్నాళ్ళు గడిచాయి.

భూలోకంలో ప్రజలు మూడుపూటలా తింటూ ఒక్కపూట స్నానం, పూజ చేస్తూ (అదికూడా వీలైతే) మదమెక్కి హత్యలు, మానభంగాలు, అరాచకంగా జీవిస్తున్నారు.

వాళ్ళలో మార్పు రాకపోగా, శుచిశుభ్రత తక్కువై, దైవారాధనలు మరిచి పోయి... పరిస్థితి యధాస్థితికి వచ్చేసరికి దేవతలంతా మరోసారి సమా వేశమై బ్రహ్మదేవుణ్ని కలిసారు.

బ్రహ్మదేవుడు తన దివ్యదృష్టితో జరిగిందంతా నందీశ్వరుని 'మతి మరుపు' వలననే యిలా జరిగిందని నందీశ్వరుణ్ని పిలిపించి విషయం తెలుసుకోగా, తానొకటి ఆజ్ఞాపిస్తే నంది ఒకటి చెప్పొచ్చాడని అర్థమైంది.

"నందీశ్వరా, యిదంతా నీ మతిమరుపు వలనే జరిగింది. దీనివలన భూలోకంలో తిండి దొరక్క నీర దొరక్క రాబోయే రోజుల్లో పెద్ద కరువేర్పడ బోతుంది. ఇదంతా నీ తప్పిదమే." అన్నాడు బ్రహ్మ ఆగ్రహంతో.

దేవతలంతా "ఔను...! ఔను!!" అంటూ ఏకకంఠంతో అన్నారు.

"నా మతిమరపు వలన భూలోకవాసులకు యింతటి ముప్పేర్పడ బోతుందని వూహించలేదు స్వామి. నా తప్పును మన్నించండి. మీరే శిక్ష విధించినా సిద్ధమే స్వామి" అంటూ దేవతలందర్నీ దీనంగా ప్రాధేయ పడ్డాక...

బ్రహ్మ నందీశ్వరుణ్ని మన్నించి "నువ్వు వెంటనే భూలోకానికి వెళ్ళి మానవుల తిండిగింజలు పండించడానికి వాళ్ళ పొలాలు దున్ని పంటలు పండించేలా కష్టపడి, వాళ్ళకు చేదోడు వాదోడుగా నిలు. అదే నీకు సరియైన శిక్ష" ఆజ్ఞాపించాడు.

వెంటనే "చిత్తం స్వామీ" అంటూ భూలోకానికి చేరి ప్రజల వ్యవసాయం పనుల్లో, పొలాలు దున్ని ప్రజలకు కావల్సిన తిండిగింజలు అందే విధంగా భూలోకంలోనే స్థిరపడ్డాడ...ట.

చూశారా...

నంది ఆ రోజుల్లో తన మతిమరుపు వలన జరిగిన పొరపాటుకి శిక్ష సంతోషంగా అనుభవిస్తూ మానవులలో కలిసిపోయాడు.

అదే మనిషికీ గొడ్డుకీ వున్న తేడా!

## ప్రపంచ మతిమరుపు మహాశయుల మహాసభలు

-రావి శివశంకర్



ప్రపంచ మతిమరుపు దినోత్సవం (ఫిబ్రవరి 30, 31) సందర్భంగా మహాసభలు మరచిపోకుండా జరుపుటకు నిర్ణయించినాము. కావున ప్రపంచంలో గల మతిమరుపు మహాశయులందరికి స్వాగతం.

వేలాదిమందిగా హాజరై ఈ సభను జయప్రదం చేయగలరని కోరు చున్నాము.

**కార్యక్రమ వివరాలు:** 30వ తేదీ, ఉదయం 10 గంటలకు ప్రముఖ ప్రపంచ మానసిక వైద్యులు శ్రీ మెమరీబ్రాట్‌గారిచే జ్యోతి ప్రజ్వలన.

**అధ్యక్షులు :** ప్రముఖ హల్లోపతి వైద్యులు శ్రీ పిచ్చేశ్వరనాథ్‌గారు.

సభానంతరం ప్రముఖ సినీ ఐటం డ్యాన్సర్ (నన్ను నేనే మరిచాను ఫేం) మందమతిగారి భరతనాట్య ప్రదర్శన.

**వేదిక :** మెంటల్ ఆస్పత్రి ప్రాంగణము. ఫాగల్ నగర్.

**అతిథులకు ముఖ్య సూచనలు :** విచ్చేసే అతిథులు తమపేరు, చిరునామా, తదితర వివరాలు గల స్లిప్ తమ దుస్తులపై కనబడే విధంగా పిన్ చేసుకొని రావలెను. తిరిగి వెళ్లాల్సిన బస్సు, యితర వాహనాలు నంబర్ స్లిప్‌లు కూడా జాగ్రత్త చేసుకోవలెను.

తమ పాదరక్షలు కూడా క్యారీబ్యాగులో జాగ్రత్తపర్చి దానిపై కూడా స్లిప్ పిన్‌చేసి ప్రాంగణం బైటనే కౌంటర్లో పెట్టవలెను.

అతిథులకు ఈ రెండురోజుల్లో బ్రేక్‌ఫాస్ట్, లంచ్, డిన్నర్ సౌకర్యం ఉచితంగా ఏర్పాటు చేయబడినది.

అతిథులు దయచేసి తాము భోంచేసేది విస్తర్లలో కాబట్టి యింట్లో మాదిరిగా మతిమరుపుతో ఎంగిలి చేతులు ఆకుల్లో కడుగరాదు.

మహాసభల అనంతరం 'మతిమరుపు పోటీలు నిర్వహించి తగు బహుమతులు బిరుదులు ప్రధానం జరుగును.

కేవలం మతిమరుపు గలవారికే ప్రవేశం.

**మన డిమాండ్స్...**

- ప్రపంచ మతిమరుపు మేధావుల్లారా ఏకం కండి...!
- మతిమరుపు విద్యార్థులందరికి 40% గ్రేస్ మార్కులు ప్రతీ సబ్జెక్ట్‌లో కలపాలి.
- మతిమరుపు వాళ్ళందరికి అన్నిటిలో రిజర్వేషన్ కల్పించాలి.
- మతిమరుపు వాళ్ళకు బస్సుల్లో, ట్రైన్లలో ఆటోల్లో ఛార్జీలు 75% రాయితీ ఇవ్వాలి, ప్రత్యేక సీట్లు కేటాయించాలి.
- మతిమరుపు వాళ్ళకు ఎన్నికలలో 50% సీట్లు కేటాయించాలి.
- మతిమరుపు వాళ్ళకు 0% వడ్డీపై బ్యాంక్ రుణాలివ్వాలి.
- మతిమరుపువార్కి అన్ని షాపుల్లో 35% రాయితీలు యివ్వాలి.

-ప్రపంచ మతిమరుపు మహాసభల నిర్వాహకులు.




**కార్టూన్లు జిందాబాద్...**
**తెలుగు కార్టూనిస్ట్‌లు జయహో...**

అంటూ మూడు రోజులపాటు హైదరాబాద్ పబ్లిక్ గార్డెన్స్‌లో **కార్టూన్ ఉత్సవ్ 2012** జరిగాయి. పండుగ వాతావరణాన్ని తలపింపచేస్తూ... మన తెలుగు కార్టూనిస్ట్‌లందరూ ఒక చోట కలసి చేసిన సందడి చూసే వాళ్ళకు కన్నుల పండుగైంది.

మొదటిరోజు(28–10) ప్రముఖ కార్టూనిస్ట్ శ్రీ జయదేవ్ గారు ఈ ఉత్సవాన్ని ప్రారంభించారు. శ్రీ కె.వి. రమణాచారి గారి అధ్యక్షతన సభ ప్రారంభమయింది. ప్రముఖ కార్టూనిస్ట్ శ్రీరాంపా కార్యక్రమాన్ని నవ్వుల పువ్వులు రువ్వుతూ... ఆసాంతం ఆహ్లాదంగా సాగేటట్లు కృషి చేసారు. ప్రముఖ కార్టూనిస్ట్ సుభానీ కార్టూన్ల సంకలనం 'ఆదాబ్ హైదరాబాద్' పుస్తకం, ప్రముఖ కార్టూనిస్ట్ గీతాసుబ్బారావు కార్టూన్ల సంకలనం ఆవిష్కరించారు.

హాస్యానందం'ఫుల్‌పిల్లర్' శ్రీ బ్నింగారి పుట్టినరోజు వేడుక కార్టూనిస్ట్‌ల సమక్షంలో జరిగింది.

గార్డెన్‌లో ఏర్పాటు చేసిన కార్టూన్ల ప్రదర్శన సందర్శకులను ఎంతగానో ఆకట్టుకుంది. మన తెలుగు కార్టూనిస్ట్‌ల కలం వాడి.. వేడి... రుచి చూపించాయి.

ఇక రెండవ రోజున ప్రముఖ కార్టూనిస్ట్‌లు సుభానీ, శంకర్, యువ కార్టూనిస్ట్‌లకు మెలకువలు తెలియజేసే కార్యక్రమం ఆసక్తిగా సాగింది. సాయంత్రం కార్టూనిస్ట్ మోహన్‌గారి యానిమేషన్ ఫిల్మ్ ప్రదర్శనానంతరం కార్టూనిస్ట్‌లు అందరూ కలసి హుస్సేన్‌సాగర్‌లో విహరించడం ఓ మరపురాని అనుభూతిని కలిగించింది.

చివరి రోజైన మూడవ రోజు మన కార్టూనిస్ట్‌లందరూ తమ తమ అనుభవాలను కార్టూనిస్ట్ మిత్రులతో పంచుకున్నారు.

సాయంత్రం శంకు'ఈ కార్టూన్లు మీవే'; బాలి 'ఫినిక్స్ కార్టూన్స్' పుస్తకావిష్కరణలు జరిగాయి.

కార్టూన్ కళలో విశిష్ట సేవలందించిన వారికి సత్కారంతో ఈ సభ ముగిసింది.

కార్టూనిస్ట్‌లందరూ ఈ కార్యక్రమాలని ఒక మధురానుభూతిగా మనసులో పదిల పరచుకుని, తమ హర్షాతిరేకాన్ని తెలియజేసారు.


మన 'బొమ్మర్సి' బాపుగారికి 'పద్మవిభూషణ్' బిరుదివ్వాలనే ఒక తీర్మానం పై కార్టూనిస్ట్‌లందరూ సంతకాలు చేసారు.

ఇంతటి అద్భుతమైన కార్యక్రమాన్ని నిర్వహించిన 'సమైక్య భారతి' సత్యనారాయణగారు అభినందనీయులు.














కార్టూన్ ఉత్సవ్-2012











మతిమరుపు స్పెషల్

# ప్రొఫెసర్ గంగాధరం

కండ్లకుంట శరత్ చంద్ర
sharathtruth@gmail.com

"ఏమండీ!" లత కెవ్వున అరిచింది.

పళ్ళు తోముకుంటున్న ప్రొఫెసర్ గంగాధరం అదిరిపడి భార్యవంక చూశాడు.

"మీరు నా బ్రష్‌తో మొహం కడుక్కుంటున్నారు."

గంగాధరం బ్రష్‌వంక చూసి "ఓహ్! ఇది నీ బ్రష్ కదూ... మర్చిపోయాను" అన్నాడు బ్రష్ కడిగేస్తూ.

కాసేపయ్యాక "నో... " లత మళ్ళీ అరిచింది.

స్నానం చేసి, బయటికి వచ్చిన గంగాధరం లత ఎందుకు అరిచిందో అర్థంగాక, దిక్కులు చూశాడు.

"టవల్ కట్టుకుని తగలడండి" లత మళ్ళీ అరిచింది.

తన వంటిమీద టవల్ లేదన్న విషయం గ్రహించి, గంగాధరం బాత్‌రూంలోకి గెంతి నడుముకు టవల్ కట్టుకుని వచ్చాడు.

"అబ్బా!" లత మళ్ళీ అరిచింది. గంగాధరం ఆమె వంక ప్రశ్నార్థకంగా చూశాడు.

"ఇడ్లీలో చట్నీ నంజుకోండి. చట్నీలో ఇడ్లీ కాదు."

ఓసారి తన చేతివంక చూసుకున్నాడు. చేతిలో చట్నీ వుంది. మౌనంగా చట్నీని ప్లేట్‌లో వేసి ఇడ్లీముక్కను చట్నీలో నంజుకు తినసాగాడు.

మరో రెండు నిముషాల తర్వాత "ఆగండి" మళ్ళీ లత అరుపు.

గంగాధరం వెనక్కి తిరిగి ఆమెవైపు చూశాడు.

"రెండో బూటుకూడా వేసుకుంటే బావుంటుంది" కోపంగా అంది.

గంగాధరం తన కాళ్ళవంక చూసుకున్నాడు. ఒకే బూటు వేసుకుని వెళ్ళిపోతున్నాడు. 'ఛ!' అనుకుంటూ రెండో బూటుకూడా వేస్కొని, బయటికి నడిచాడు.

✦ ✦ ✦

గంగాధరం కారు రవీంద్రభారతి ప్రక్కన ఆగింది.

"సర్! దిగండి" అన్నాడు డ్రైవింగ్ సీట్‌లోని గంగాధరం.




"సా...ర్! నేను డ్రైవర్‌ని. మీరు ప్రొఫెసర్" ప్రక్కసీటులో కూర్చున్న డ్రైవర్ చెప్పాడు.

గంగాధరం తలవిదిలించి "ఓహ్ అలాగా!" అన్నాడు దిగుతూ.

అతడు దిగీదిగగానే చటుక్కున అతని మెడలో ఓ పూలదండ వేసి షేక్‌హ్యాండ్ ఇస్తూ కసాబిసా చేతిని నొక్కేసి "పదండి సార్" అన్నాడు కార్య నిర్వాహక సభ్యుడు.

గంగాధరం "ఉఫ్...ఉఫ్' అని చేతిని ఊదుకుంటూ, బలవంతంగా చిరునవ్వు నవ్వాడు.

ఇద్దరూ ఆడిటోరియంలోనికి ప్రవేశించారు.

ఆడిటోరియంలో జనం పల్చగా వున్నారు.

"గనేచషరనం విగ్నవినాయక... హరనం..." అంటూ పదాలను ఖూనీ చేస్తూ ఓ పిల్లకాకి వేదికమీద ప్రార్థనా శ్లోకం పాడుతోంది.

"ఏమిటయ్యా, ఇంత కఠోరంగా పాడుతోంది" అన్నాడు గంగాధరం చెవులు మూసుకుంటూ.

"అయ్యయ్యో, అలా అంటారేంటి సార్! ఈ అమ్మాయి టి.టీ.వీ. నిర్వహించిన పాడం దహే... అనే ప్రోగ్రాంలో ఫస్ట్‌ప్రైజ్ సంపాదించింది. ఈ ఆడిటోరియంలో చాలామంది ఈ అమ్మాయి ఫ్యాన్సే" చెప్పాడు కార్యనిర్వాహక సభ్యుడు.

గంగాధరాన్ని కనికరించి ఆ పాటను పూర్తి చేసి పాప వేదిక దిగింది.

ఆమెతోపాటూ ఆడిటోరియంలో వున్న ఆమె తల్లిదండ్రులు, బంధువులు లేచి బయటికి వెళ్ళిపోయారు.

సభ ప్రారంభమయ్యింది.

కార్యనిర్వాహక సభ్యులు, వక్తలను వేదికపైకి ఆహ్వానించారు.

"ఈ రోజు మనం సన్మానించబోయే ప్రముఖ కవి,రచయిత శ్రీ అంబోతుల కుక్కుటేశ్వర్రావ్‌గారి గురించి వక్తలు ప్రసంగిస్తారు. ముందుగా... పండిత మహాశయుడు శ్రీ విష్ణుశర్మగారు ప్రసంగిస్తారు.

విష్ణుశర్మ మైక్‌ముందుకు వచ్చి కంఠం సవరించుకుని రెండు పద్యాలు చదివి, కుక్కుటేశ్వర్రావ్ గురించి తనకు తెల్సిందీ, తెలియనిదీ కలిపి అరగంటపాటు బాది వదిలాడు.

సగంమంది ప్రేక్షకులు పారిపోయారు.

"ఇప్పుడు ప్రముఖ వారపత్రిక ఎడిటర్ గోరోజనంగారు ప్రసంగిస్తారు"

గోరోజనం రెండేరెండు వాక్యాలు మాట్లాడి కూర్చున్నాడు.

"ఇప్పుడు మేధావి, ప్రొఫెసర్ గంగాధరంగారు ప్రసంగిస్తారు."

గంగాధరం సభలో మిగిలిన పాతికమంది ప్రేక్షకులవంక చూడసాగాడు.

"అయ్యా... ఇప్పుడు ప్రసంగించాల్సింది తమరే" గోరోజనం గంగాధరానికి చెవిలో చెప్పాడు.

గంగాధరం తడుముకుంటూ లేచి... మైక్ ముందుకు వచ్చాడు.

"ఒరేయ్!... నేను చెప్పలేదు... ప్రొఫెసర్ గారని... ఈయనే. నేను ఈయనదగ్గరే చదువుకున్నాను. జాగ్రత్తగా ఈయన చెప్పేది విను" ప్రేక్షకులలో ఒకాయన ప్రక్క సీట్‌లో కూర్చుని సెల్‌ఫోన్‌లో వీడియో గేమ్ ఆడుతున్న తన కుమారునితో చెప్పాడు.

గంగాధరం గొంతు సవరించుకుని "ఈరోజు ఎంతో బాధాకరమైన రోజు. జాతస్యహిధ్రువో మృత్యుః అన్నారు. ఎంతటివారికైనా మరణం తప్పదు. శ్రీ రావ్‌గారి మరణం ఎంతో బాధాకరం. శ్రీ రావ్‌గారిని అంబోతు పొడిచి చంపడం, కుక్కుటం అనగా... కోడి! కోడి ఆయన కళ్ళను పొడవడం విచారకరం. శ్రీ రావుగారి ఆత్మ కచ్చితంగా స్వర్గానికే వెళుతుందా అంటే... చెప్పలేం. నరకానికి కూడా వెళ్ళొచ్చు. ఎక్కడికి వెళ్ళినా, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలి.

రావుగారి లాంటి కవి మరణించడంవల్ల తెలుగు సాహిత్యానికి ఏమైనా లోటా అంటే... చెప్పలేం. ఆయనను మించిన ఎందరో కవులు ఇంకా వున్నారుగా!

రావుగారి చావుతో కవిత్వం చావదు. రావుగారి చావుతో సాహిత్యం చావదు. సరే, ఏది ఏమైనప్పటికీ ఆయన చావుధృవస్త్వా. ఈ సభ నిర్వహించిన కార్యనిర్వాహక సభ్యులకు నా వందనాలు. ఇప్పుడు మనమందరం ఆయన ఆత్మశాంతికై మౌనం పాటిద్దాం" అని కళ్ళు మూసుకున్నాడు.

సభలో కలకలం, గోల. గంగాధరం ఇవేవీ పట్టించుకోకుండా రెండునిముషాల తర్వాత కళ్ళు తెరిచాడు.

శ్రీ అంబోతుల కుక్కుటేశ్వరరావ్ కోపంతో కార్యనిర్వాహక సభ్యులపై రంకెలు వేస్తున్నాడు.

ప్రేక్షకులలో కొందరు పగలబడి నవ్వుతున్నారు. కొందరు కోపంగా చూస్తున్నారు. వక్తలైతే అందరూ నవ్వుతున్నారు. కార్యనిర్వాహక సభ్యులు, ఏడుపు మొహాలు వేసుకుని చూస్తున్నారు.

గంగాధరానికి ఏమీ అర్థంకాలేదు.

"ఒక మనిషి చచ్చిపోతే బాధపడాలిగానీ....



ఇలా నవ్వుతున్నారేం? మీరందరూ ప్రశాంతంగా వుండకపోతే శ్రీ రావుగారి ఆత్మ రౌరవాది నరకాలలో పడుతుంది. శ్రీ రావుగారిని... యమభటులు తిరిగమోత పెట్టిన బాణలిలో పెట్టి వేయిస్తారు. అది మీకు ఇష్టమా? మౌనంగా వుంటేనే ఆత్మ శాంతిస్తుంది" మైక్‌లో గంగాధరం హితబోధ చేశాడు.

అందరూ పొట్టచెక్కలయ్యేలా నవ్వుకోసాగారు.

ఓ కార్యనిర్వాహక సభ్యుడు ముందుకొచ్చి మైక్ ఆఫ్ చేసి గంగాధరాన్ని బలవంతంగా ప్రక్కకు లాగాడు.

కుక్కుటేశ్వరరావు గంగాధరాన్ని నోటికొచ్చిన నాటుపదజాలంతో తిట్టసాగాడు.

"ఎవడయ్యా వాడు! మేనర్స్ లేకుండా సభలో అలా పిచ్చికూతలు కూస్తున్నాడు" అడిగాడు గంగాధరం.

"అయ్యో! ఆయనే... ఇప్పటివరకూ తమరు ప్రస్తావించిన శ్రీ రావుగారు" ఓ వక్త చెప్పాడు.

గంగాధరం ఏమాత్రం కంగారుపడకుండా "అవునా? మరి వీడు ఎలా బ్రతికొచ్చాడు?" అడిగాడు.

ఏం మాట్లాడాలో, ఎవ్వరికీ అర్థంకాలేదు.

◆ ◆ ◆

గంగాధరం కారు త్యాగరాజగానసభ ముందు ఆగింది.

అతడు లోపలికి వెళ్ళి ముందు వరుసలోని సీట్‌లో కూర్చున్నాడు. కార్యనిర్వాహక సభ్యుడు వచ్చి సీరియస్‌గా అతనికి నమస్కరించి వెళ్ళాడు.

ఐదు నిముషాల తర్వాత సభ ప్రారంభ మయ్యింది. సభంతా ప్రేక్షకులతో కిటకిట లాడిపోతోంది. అందరూ విషణ్ణవదనాలతో సీరియస్‌గా వున్నారు.

"సభకు నమస్కారం. ముందుగా... శ్రీ గంగా ధరంగారు తమ సంతాపాన్ని తెలియచేస్తారు" కార్యనిర్వాహక సభ్యుడు చెప్పాడు.

గంగాధరం చిరునవ్వుతో మైకుముందుకొచ్చి "ఈరోజు ఎంతో ఆనందకరమైన రోజు. ఇలాంటి రోజులు మళ్ళీ మళ్ళీ రావాలని కోరు కుంటున్నాను" అన్నాడు.

అందరూ మొహామొహాలు చూసుకున్నారు.

"ఇలాంటి సంతోషకరమైన సభలో పాల్గొ నడం నా అదృష్టం. అందులోనూ మాట్లాడే అవ కాశం ముందుగా నాకు ఇవ్వడం ఎంతో సంతోషం. హ్హహ్హహ్హ ఈ సభ కిటకిటలాడడం చూస్తుంటే నాకు నా చిన్నప్పటిరోజులు గుర్తొస్తు న్నాయి. జాతరలో... చీకులమ్మే చిన్ని డ్యాన్స్ చూసేందుకు జనం ఇలాగే ఎగబడి వచ్చేవారు. ఇకపోతే..." తాను ఎవరిగురించి మాట్లాడాలో అర్థంకాక తలతిప్పి వేదిక వెనకభాగంలో కట్టిన బ్యానర్‌పైనున్న పేరును చదివి "ఆc! శ్రీ సాగర్ గారు చాలా గొప్ప గాయకులు. ఆయనను ఈ రోజు సన్మానించుకోవడం ఎంతో ఆనందంగా వుంది. శ్రీ సాగర్‌గారి గొంతే గొంతు. ఆయన పాటే పాట! పాటంటే ఓ జోకు జ్ఞాపకాని




కొస్తోంది" అంటూ ఓ జోకు చెప్పాడు.

ఎవరూ నవ్వలేదు. "అరే! ఎవరూ నవ్వలేదే!" అని ఫీలైపోయి మరో రెండు జోకులు పేల్చాడు.

అందరూ సీరియస్సైపోయి బండబూతులు తిట్టసాగారు.

ఎవరో ఒకాయన వచ్చి గంగాధరం మెడపై చేయివేసి బరబరా లాక్కెళ్ళి "సంతాపసభలో జోకులు వేస్తావుట్రా... ఈడియట్!" అంటూ గేటుబయట తోసేసాడు.

గంగాధరం కారు తాలూకు డ్రైవర్ వచ్చి అతడిని పైకి లేపి "ఏమైంది సార్?" అడిగాడు.

"అదే అర్థంకావడంలేదయ్యా. వెధవలకి బొత్తిగా కామెడీ సెన్స్ లేదు."

◆ ◆ ◆

గంగాధరం యూనివర్శిటీకి వెళ్ళి క్లాసులో పాఠం చెప్పసాగాడు.

"జ్ఞాపకశక్తి అనేది విద్యార్థులకు ఎంతో ముఖ్యం. ఇప్పుడు నేను మీకు... జ్ఞాపకశక్తి గురించి చిట్కాలు చెప్తానన్నమాట."

విద్యార్థులందరూ పగలబడి నవ్వసాగారు.

వాళ్ళు ఎందుకు నవ్వుతున్నారో, గంగాధరా నికి అస్సలు అర్థంకాలేదు.

'కొంపదీసి ప్యాంటో, షూసో వేసుకురావడం మర్చిపోయానా?' అని క్రిందినుండి మీదిదాకా చూసుకున్నాడు. అంతా బాగానే వుంది.

"మీరు ఎందుకు నవ్వుతున్నారు?" అడిగాడు.

"సర్! మీరు మేథ్స్ ప్రొఫెసర్. ఇది ఎకనా మిక్స్ క్లాస్" ఓ విద్యార్థి చెప్పాడు.

గంగాధరం షాక్ తిని తన మతిమరుపును కవర్ చేసుకుంటూ–

"తెలుసోయ్!... తెలిసే వచ్చాను. ఏం, జ్ఞాపక శక్తికి చిట్కాలు మీకు అవసరం లేదా?"అన్నాడు.

"అవసరమే సార్!"

"అయితే వినండి. మొదటి చిట్కా... మొ...ద...టి... చి...ట్కా..." గంగాధరానికి అదేమిటో అస్సలు గుర్తురాలేదు.

"అర్జెంటు పనుందోయ్! మళ్ళీ వచ్చి చెప్తా" అనేసి బయటికి వెళ్ళిపోయాడు.

అతడు వెళ్ళిపోతుంటే ఓ రెండు వాక్యాలు అతని చెవిలో పడ్డాయి.


"ఈయనే ఓ మతిమరుపు మేళం... ఈయన జ్ఞాపకశక్తికి చిట్కాలు చెప్తాడా? అందుకేరా... చదువుకోవాలిగానీ... మరీ ఇంతగా చదివితే వున్న మతి పోతుంది."


గంగాధరం తలబాదుకుంటూ లైబ్రరీకి వెళ్ళి మేథ్స్‌పుస్తకం అనుకుని తెలుగు సాహిత్యానికి చెందిన ఓ పుస్తకం తీసి... సీరియస్‌గా చదువుతో సాగాడు.


అతడు మూడురోజుల నుండీ... ఇంటికి వెళ్ళకుండా యూనివర్శిటీలోనే వున్నాడన్న విషయం అతనికి తెలీదు.


అతని సెల్‌ఫోన్ బాత్‌రూమ్‌లో మర్చి పోయాడు. భార్యను ఇంట్లోపెట్టి తాళం వేసా దన్న విషయమూ మర్చిపోయాడు.



భువన్/*
మతిమరపు
దీపావళి


ఆయన మతిమరపే
మాకు వరం పిన్నిగారూ...
అప్పారావు
RTC కండక్టర్


మళ్ళీ సిగరెట్టనుకుని లక్ష్మీ
బాంబును నోట్లో పెట్టుకుని
ముట్టించాడు మొద్దూ!


అల్లుడు గారు కాకర పువ్వొత్తి
వెలిగిస్తారట... ముప్పై అడుగుల
కర్ర తీసుకు రమ్మంటున్నారండీ...


డాక్టర్ గారూ వెళ్ళి కత్తెరలు
ఎందుకైనా చూసి వెళ్ళిపోకండే...
ఆపరేషన్ చేసేటప్పుడు ఆయ
నకి కాస్త మతిమరపులెండి...
MBBS


కాలితో బాంబులు కాలుస్తుంటా
డని చెప్పానే.. ఈయనేరా...


మతిమరుపు స్పెషల్



# నా మరుపు పరుపు మందాన

గంగాధర్ వడ్లమన్నాటి
9908445969

విశ్వనాథం తనతో పాటు తెచ్చుకున్న చీటీని మాటిమాటికీ చూస్తూ తనలో తానే 'ఔను, నేను ఇప్పుడు సైకియాట్రిస్ట్ రామ్మూర్తిగారి దగ్గరికి వెళ్ళాలి. అది కొత్త రోడ్డులో ముత్తు కాంప్లెక్స్ దగ్గర సత్యజిత్ బిల్డింగ్స్‌లో సెవెంత్ ఫ్లోర్‌లో వుంది. హమ్మయ్య ఇక మర్చిపోను కంఠతా వచ్చేసింది' అనుకుంటూ నడుస్తూ మొత్తానికి సైకియాట్రిస్ట్ కేబిన్ దగ్గరికి వచ్చేశాడు.




ముందుగా చాలామంది పేషెంట్లు వుంటారని అనుకున్నాడు. కానీ అదృష్టం, అక్కడ ఎవరూ లేరు. భలే అనుకుంటూ నేరుగా డాక్టర్‌గారి గదిలోకి వెళ్ళి ముఖానికి నవ్వు పులిమాడు.

విశ్వనాథాన్ని చూస్తూనే "రండి, కూర్చోండి' అన్నట్టు సైగ చేసి తర్వాత... కొద్ది క్షణాలకి "చెప్పండి" అన్నాడు డాక్టర్ రామ్మూర్తిగారు విశ్వం వంక దీర్ఘంగా చూస్తూ.

"నాకు ఈ మధ్య మరపు బాగా పెరిగి పోతోంది డాక్టర్‌గారూ! మరుపు పరుపు మందాన వుంది. దాన్ని మీ వైద్యంతో అరగదీసి, కరగదీసి దాన్ని కనుమరుగు చేసేయాలి. చెప్పాడు అమాయకంగా.

"అలాగా! ఎన్నిరోజులుగా మీకు ఇలా అన్పి స్తోంది?"

"నేను మేడమెట్లపై నుండి పడి తలకి దెబ్బ తగిలినప్పటి నుండి డాక్టరుగారూ."

"అంటే... ఏ తరహా మరపుగా మీకు అన్పిస్తోంది. ఏమైనా సంఘటనలు చెప్పగలరా?"

"చెప్తాను డాక్టర్. ఆఫీసు అయ్యాక బండిపై ఇంటికి వస్తూ, వేరే ఇంటికి వెళ్ళిపోతున్నాను."

"అదెలాగ?"

"మేం ఇల్లు మారాం లెండి. కానీ ఇంకా నేను మా పాత ఇంటికే వెళ్ళిపోతున్నాను".

"అలాగా! అది అంత అసాధారణం అని నాకు అనిపించడం లేదే" చెప్పాడు డాక్టర్.

"కానీ మేం ఇల్లు మారి ఇప్పటికి నెలరోజు లవుతుంది" చెప్పాడు అసలు విషయం చల్లగా.

"ఔనా!" నోరెళ్ళబెట్టాడు డాక్టర్.

"ఔను డాక్టర్! అది మాత్రమే కాక నా సెల్ ఫోన్‌కి సురేషో, మహేషో అని పేరు పడుతున్నా వారెవరో వెంటనే గుర్తుకురాక మీరెవరో గుర్తు చేయండి అని వారినే అనివార్యమై అడుగు తున్నాను. దాంతో కొందరు ఓపిగ్గా గుర్తుచేసినా కొందరు మాత్రం స్నేహితుడ్నే మర్చిపోయావా అంటూ ఒకడు క్లాస్ పీకుతాడు. మరొకడు అప్పి చ్చినవాడ్నే మరిచిపోయావా? లేక నా అప్పు ఎగ్గొట్టడానికి నాటకమా. నాకు నమ్మకంలేదు. నా అప్పు తీర్చేయ్ అని అఘోరిస్తే వాడి అప్పు మొత్తం పెద్ద వడ్డీకి లోన్ పెట్టి మరీ తీర్చాల్సి వచ్చింది" చెప్పాడు దిగాలుగా.

"అలాగా! మరింత ఆశ్చర్యం ప్రదర్శించాడు డాక్టర్ కళ్ళు పెద్దవి చేస్తూ.

అదిమాత్రమే కాదు డాక్టరుగారూ! మా తమ్ము డికి వాళ్ళమ్మాయిని అడగడానికి గాను మాతో దూరపు చుట్టరికం కలిగిన మా మావయ్య ఒకా యన మా ఇంటికి వస్తే, నాకు ఎవరో గుర్తుకు రాక, పెద్దోడు కదా అని బాబాయ్, బాబాయ్ అని పలకరించి పిలిచేసరికి అతను డీజిల్ ధర పెంపుపై ప్రతిపక్షంలా నాపై విరుచుకుపడి, నీకు మా సంబంధం ఇష్టం లేకపోతే లేదని చెప్పు. అంతేకానీ నన్నిలా వరస మార్చి పిలిచి అవమా నించక్కర్లా అని రుస రుసలాడి వెళ్ళిపోయాడు"

చెప్పాడు మరింత దిగాలు స్వరంతో.

తర్వాత డాక్టర్‌గారు ధైర్యం చెప్పి, మందులు రాశారు. ఆ మందులు చీటీ తీసుకుని, ఫీజు ఇచ్చేసి బయటికి వస్తుండగా ఒకతను ఎదురు పడి, నేను లేటుగా వచ్చానని "తిరిగి వెళ్ళిపోతున్నారా? సారీ ఫర్ డిలే. రండి" చెప్పాడతను.

అతని మాటలకి విశ్వం విత్తరచూపులు చూస్తూ క్షమించాలి. మీరెవరండి" అడిగాడు వినయంగా.

"నేనే సైకియాట్రిస్ట్ రామ్మూర్తి. మీరు నా కేబిన్‌లోంచి వస్తున్నారుగా. అంటే నేను లేనని వెళ్ళిపోతున్నారని గ్రహించి అలా అన్నాను" చెప్పాడతను.

ఆ!c... అcccc!!... అంటే మరి లోన వున్న సైకియాట్రిస్టు.

"లోన వున్నాడా!" అని ఓ క్షణం బాగా ఆలోచించి, అంటే ఈ రోజు కూడా ఆ మతి మరపు రమణమూర్తి తన కేబిన్ అనుకుని నా కేబిన్‌లో కూర్చున్నాడన్న మాట.

"అంటే అతను సైకియాట్రిస్ట్ కాదా?"

"కాదండీ. ఫిజిషియన్. కాకపోతే ఓ నాలుగు నెలల క్రితం యాక్సిడెంట్‌లో తలకి దెబ్బ తగిలింది. ఈ మధ్యనే కోమాలోంచి బయటికి వచ్చి, ఓ రెండు వారాలనుండి క్లినిక్‌కి వస్తున్నాడు. కాకపోతే మరుపు వచ్చింది.... అందుకే రమణమూర్తి, రామ్మూర్తి పేర్లతో తికమకపడి, అతనే సైకియాట్రిస్ట్ అనుకుని ఇలా అప్పుడప్పుడు నా కేబిన్‌లోకి వచ్చి కూర్చుంటున్నాడు" చెప్పాడు విపులంగా.


"అంటే, నేనిచ్చిన మూడువందల రూపాయల ఫీజు, ఆ పక్కనే కొన్న మూడువేల రూపాయల మందులూ వృథాయేనా?..." అడిగాడు బిక్క మొహంవేసి... అతనికి ఆ మందుల చీటిని చూపుతూ.


అది చూసిన ఆ సైకియాట్రిస్ట్ చిన్నగా నవ్వుతూ, "ఏంకాదు. ఈ మందులు వాడు. పూర్తిగా నీ మరపు తగ్గిపోతుంది" చెప్పాడాయన.


"అదెలా డాక్టరుగారూ! అతను ఫిజిషియన్ అన్నారు. మరి..."నసిగాడు విశ్వం కంగారుగా.

"ఏముంది. అతని మరపు పోవడానికి ఏ మందులు వాడుతున్నాడో అవే నీకూ రాశాడు. అదీ అసలు సంగతి" అని చెప్పగానే తెల్లమొహం వేసి చూస్తూండిపోయాడు విశ్వనాథం.

# మరుపానందం





నవ్వుల రారాజు

ఫ్లాష్‌బ్యాక్



# చార్లీచాప్లిన్ ది గ్రేట్!

విష్ణుభొట్ల రామకృష్ణ

ఫోన్: 9 4 4 0 6 1 8 1 2 2

**మాక్‌సెన్నెట్ అప్పటి సినిమా డైరెక్టర్లలో మంచి డైరెక్టరు, మరియు వ్యక్తిగతంగా మంచివాడు, సౌమ్యుడు కావటంకూడ చాప్లిన్‌కు కలిసి వచ్చింది. చాప్లిన్ నటించే ప్రతి సినిమాలో తన నటనను తానే నిర్ణయించుకొనేవాడు. అలా నటించటాన్ని సెన్నెట్ ఎటువంటి అభ్యంతరాలు పెట్టకుండా ఒప్పుకొనేవాడు. మరియు చాప్లిన్ ఇచ్చే అనేక సలహాలను ఆమోదించేవాడు. అతని నటనను ప్రదర్శించటానికి అడ్డు చెప్పేవాడు కాదు.**

**దానివలన చార్లీకి మానసికంగా చాలా ధైర్యం వచ్చింది. తాను హాస్యాన్ని పండించ గలను, నలుగురిని నవ్వుల్లో ముంచగలను అనే ధైర్యం వచ్చింది. సెనేట్ అతని నటనను నిరంతరం వెన్నంటి ప్రోత్సహించటం కూడ అతనిలో కొండంత ధైర్యం కల్గింది.**

దీనివల్ల అతనిలో నటనపై వున్నా ఆసక్తి పెరిగింది. హాస్యాన్ని కొత్తతనంగా చూపాలన్న కోరిక పెరిగింది.

దానికోసం అతను ఎంతో సాధన చేశాడు.

అతనిలోని సృనాత్మక శక్తి వికసించింది.

ఎప్పుడు కొత్తదనాన్ని కోరుకొనే చాప్లిన్, హాస్యాన్ని కొత్తరకంగా చూపటానికి తనపాత్రకు సంబంధించిన కథను తానే సృష్టించుకొంటే ఎలా వుంటుంది! అని ఆలోచించాడు.

తన నటనలో వైవిధ్యం రావాలంటే, కథలో కూడ మార్పు రావాలి అనేది ఆయన ఉద్దేశ్యం.

అందుకోసం ఎవరో ఏదో ఒక కథ రాస్తే దానికి తగినట్టు పాత్రను మలుచుకోవటం కన్నా తన పాత్రకు తగ్గట్టు తానే కథను సృష్టించుకుంటే హాస్యాన్ని మరింత బాగా పండించవచ్చు అన్న ఆలోచన కల్గి... తన కథను తానే రాసుకోవాలని నిర్ణయించుకున్నాడు చాప్లిన్.

ఆలోచన వచ్చిందే తడవుగా తన ఆలోచనలను సెన్నెట్ ముందుంచాడు చాప్లిన్.

చాప్లిన్ ఆలోచనలను విన్నంతనే సెన్నెట్ మొదట కొంత సంశయించాడు. ఎందుకంటే అప్పటి హాస్యపాత్రలకు ప్రత్యేకమైన కథలు అంటూ ఏమీ లేనందువలన ఇలాంటి కథలను సృష్టిస్తే ప్రజలు చూడలగలరా? అని ఆలోచించాడు. కాని చాప్లిన్‌లోని ఆత్మవిశ్వాసానికి, సృష్టించే పాత్రపై అతనికి గల అపారమైన నమ్మకాన్ని తన అనుమానంతో వమ్ము చేయటం ఇష్టంలేక సెన్నెట్ అతన్ని ప్రోత్సహించాడు.

ఈ విధంగా చాప్లిన్, సెన్నెట్‌ల మధ్య చక్కని అవగాహన కారణంగా, వారు నిర్మించిన హాస్య చిత్రాలు విజయవంతం అయ్యాయి.

ఇలా విజయపరంపరతో సాగుతున్న చాప్లిన్ సినీజీవితంలో కొన్ని ఎదురుదెబ్బలు మొదలయ్యాయి.

నటుడుగా ఎదుగుతున్నా చాప్లిన్‌ను అందరు దర్శకులు ప్రోత్సహించలేదు. కొంతమందితో విభేదించాడు. కొంతమందికి నచ్చచెప్పాడు. అయినా హాస్యనటుడిగా ఎదగాలని కొంత అణిగి వున్నాడు.

సెన్నెట్‌లో కలిసి నటిస్తున్న చాప్లిన్‌ను సరికొత్త దర్శకుల చిత్రాలలో నటించే అవకాశం వచ్చింది.

చాప్లిన్ కూడా తనకు వచ్చిన అవకాశాలను సద్వినియోగ పరుచుకొనేందుకు ప్రయత్నించాడు. కాని అందులో ఓడిపోతానని ఆయన ఊహించి వుండకపోవచ్చు. లేక అలా ఓడిపోవటమే దైవనిర్ణయం అయివుండవచ్చు. కాని ఒక మంచి హాస్యనటుడు ప్రపంచానికి దొరికాడు.

సెన్నెట్ తర్వాత సినీ దర్శకుల్లో ఒకరైన లెహర్మన్ చాప్లిన్‌తో హాస్య సినిమాలు తీయటానికి ముందుకు వచ్చాడు.

చాప్లిన్ కూడ వేరొక దర్శకుని చిత్రాలలో నటించటానికి ఇష్టత చూపుతూ లెహర్మాన్ దర్శకత్వంలో నటించటానికి అంగీకరించాడు

కాని లెహర్మన్, సెన్నెట్ వలే సర్దుకుపోయే మనస్తత్వం కలవాడు కాదు. తాను దర్శకత్వం వహించే సినిమాలలో నటీనటులు తాను చెప్పినట్టు నడుచుకోవాలనే వాడు.

కాని చాప్లిన్‌కు హాస్యానికి సంబంధించిన తన కంటు ప్రత్యేకతను సంతరించుకొన్న వ్యక్తి. అందువల్ల లెహార్మన్ చెప్పినట్లు నటించటానికి అనేక ఇబ్బందులు పడ్డాడు.

ఈ విషయమై అతను లెహార్మన్‌తో తన పాత్ర విషయంలో కొంత మార్పు చేర్పులు కల్పించమని హాస్యానికి సంబంధించి, స్వంత నిర్ణయాలు తీసుకొనేందుకు అవకాశం కల్పించమని కోరాడు చాప్లిన్. దీనివలన మంచి హాస్యాన్ని అందించగలనని హామీ ఇచ్చాడు చాప్లిన్.

లెహార్మన్ చాప్లిన్ మాటలను పెడచెవిన పెట్టాడు.

చాప్లిన్ ఇచ్చిన సలహాలను చెత్తబుట్ట పాలు చేశాడు. తన సినిమాలలో నటించే నటీ, నటులు అందరూ తాను చెప్పినట్లే నటించవలసినదే అని ఆజ్ఞాపించాడు లెహార్మన్.

దానితో చాప్లిన్‌కు "లెహార్మన్‌కు నటన విషయంలో తేడాలు రావడం మొదలైంది.

చాప్లిన్ నటించే విధానం నచ్చటంలేదని... ఆ పాత్రను మరో విధంగా నటించమని లెహార్మన్ చెప్పేవాడు.

ఈ విధంగా ఇద్దరి మధ్య అభిప్రాయభేదాలు తీవ్రతరం అయ్యాయి.

దీనితో వారిద్దరి మధ్య మాటల యుద్ధం సాగేది. ఈ మాటల యుద్ధాన్ని సెట్‌లోని అందరూ ఆశ్చర్యంతోనూ, వినోదంతోనూ చూసేవారు. దీన్ని చాప్లిన్ చాలా అవమానంగా భావించేవాడు. ఇలా విభేదాల మధ్య అన్యమనస్కంగానే లెహార్మన్ చిత్రాన్ని పూర్తి చేసాడు చాప్లిన్.

లెహార్మన్ తర్వాత మరికొంతమంది దర్శకులు చాప్లిన్‌తో సినిమాలు తీయటానికి ముందుకు వచ్చారు.


చాప్లిన్ కూడ వారి దర్శకత్వంలో నటించటానికి సిద్ధపడ్డాడు.


కాని దర్శకులు తాను నటించే హాస్య పాత్రలకు నటనను స్వేచ్ఛనివ్వకపోవడం నచ్చలేదు. హాస్యానికి అడ్డుకట్ట వేయటం నచ్చలేదు.


దానితో అతను ఆ దర్శకుతో విభేదించవలసి వచ్చింది.

నూతన హాస్యం కోసం పరితపించే చాప్లిన్‌కు ఈ పద్ధతి చాలా బాధ కల్గించే అంశంగా భావించేవాడు. (సశేషం)

# మరుపానందం





సూరేపల్లి విజయ

# యూహూ

సీరియల్



**మరో పావుగంట నడిస్తే మనీబ్యాంకు వస్తుంది.**

**అంతా సజావుగా జరుగుతుందా? అనే అనుమానం. సజావుగా జరగాలనే కోరిక.**

**అతనికిప్పుడు చాలా టెన్షన్‌గా వుంది.**

**వెనుక నుంచి పోలీస్ జీపు వస్తున్న శబ్దం.**

**వెంటనే పండును పక్కకు లాగి రోడ్డుకు ఓ వారగా తీసుకువెళ్ళాడు.**

**పోలీసు జీపు వాళ్ళను దాటుకుంటూ వెళ్ళింది. పోలీసులకు ఏ మాత్రం డౌట్ వచ్చినా ఇంతేసంగతులు.**

**పైగా సంచీలో క్యాష్ వుంది. ఏ మాత్రం ఏమార్చే వీలులేదు.**

పది...అయిదు... రెండు... ఒకటి.. మనీ బ్యాంకు దగ్గరికి వచ్చాడు.

సగం టెన్షన్ తగ్గిన ఫీలింగ్.

"పండూ ఓసారి సెంట్రీ ఉన్నాడేమో గమనించు... ఈలోగా నేను గోడ దూకేస్తాను."

"ముందు నేను సెంట్రీ వున్నాడేమో.. చూసి వస్తాను.." అంటూ పండు చుట్టూ తిరిగి ఎంట్రన్స్ దగ్గరికి వచ్చాడు.

సెంట్రీ బీడీ కాలుస్తూ వున్నాడు.

వెంటనే వెనక్కి వచ్చేసి "బాసూ... ఆ సెంట్రీ మెలుకవగానే వున్నాడు" అని చెప్పాడు.

"నువ్వు ఆ సెంట్రీని గమనిస్తూ వుండు. నేనీలోగా పని పూర్తి చేసుకొని వస్తాను." చెప్పాడు.

"నువ్వొక్కడివే వెళ్తావా ?"

"తప్పదు. ఒకవేళ దొరికిపోయినా నేనే దొరికిపోతాను. నువ్వు పారిపోవచ్చు"

"విభా!"

"అవున్రా... ఇప్పటికే నిన్ను ఈ ట్రాప్‌లోకి అనవసరంగా ఇరికించాను. నేను దొరికే పరిస్థితి వస్తే కనీసం నిన్ను అయినా సేవ్ చేయాలన్నదే నా కోరిక"

"వద్దు బాసూ... తప్పో, రెడో, రైటో... రాంగో... ఇద్దరం కలిసే చేసాం. కలిసే వెళ్దాం" పండు సిన్సియర్‌గా చెప్పాడు.

ఇద్దరూ ప్రహరీ మీది నుంచి లోపలికి దూకే లోగా పోలీస్ విజిల్స్ వినిపించాయి.

"పండూ... పోలీసుల్లా వున్నారు" కంగారుగా హెచ్చరించాడు విభాకర్.

వెంటనే ఇద్దరూ పరుగు మొదలుపెట్టారు.

వెనుక నుంచి పోలీసువిజిల్స్...

అంతే! విభాకర్, పండు ఇద్దరు వింటి నుంచి సంధించిన బాణంలా పరుగు మొదలుపెట్టారు..

ఛేజ్ మొదలైంది.

పోలీసులకు... విభాకర్, పండులకు మధ్య ఛేజ్.

అది అర్ధరాత్రి కావడంవల్ల జనం దృష్టిలో పడ్లేదు.

పోలీసులు కూడా విజిల్స్ మానేసి తరుముతున్నారు.

ఇద్దరూ ఓ సందులోకి ఎంటరయ్యారు.

"పండూ... ఆ డబ్బు సంచీ నా చేతికి ఇచ్చి నువ్వు వెళ్ళిపో... నేను పోలీసులను ఏమారుస్తాను...

ఒకవేళ వాళ్ళకు దొరికిపోతే, నువ్వు సేఫ్‌గా వుండొచ్చు" అన్నాడు విభాకర్.

"అదేం కుదర్దు... నేనే ఆ సంచీతో పారిపోతా... దొరికితే నేనే ఈ దొంగతనం చేసానని చెబుతాను. నీకు మంచి ఫ్యూచర్ వుంది. అంతకన్నా ముఖ్యంగా నిన్ను ప్రేమించే అనిత వుంది. నీ మీదే ప్రాణాలు పెట్టుకున్న కుటుంబం వుంది. నేను అనాధను. నాకేమైనా పర్లేదు" పండు అన్నాడు.

విభాకర్ కళ్ళు చెమర్చాయి ఆ మాటలకు.

ఇద్దరి మధ్య వాగ్యుద్ధం.

చివరికి ఇద్దరూ కలిసే పారిపోవాలని నిర్ణయించుకున్నారు.

ఇద్దరూ పారిపోయే ప్రయత్నం చేస్తాంటే, ఓ

**జరిగిన కథ:** విభాకర్, పండు ఇద్దరూ ఫ్రెండ్స్ ప్లస్ నిరుద్యోగులు. డబ్బు సంపాదించడానికోసం బ్యాంక్ దోపిడి చేయాలని నిర్ణయించుకుంటారు ఇద్దరు. ఒక బ్యాంక్‌ని సెలక్ట్ చేసుకుని, ఆ బ్యాంక్‌ని దోచుకుంటారు. ఆ సొమ్మంతా ఒక పెద్ద బ్యాగులో పెట్టుకుని రైల్వేస్టేషన్‌లో మూలన పడివున్న ఒక బోగీలో పెట్టుకుని ఆ రాత్రి గడుపుతారు మిత్రులిద్దరు. అప్పట్నుంచి ఎవర్ని చూసినా భయంతో గడుపుతుంటారిద్దరు. రైల్వే స్టేషన్‌లో పోలీసులు హడావుడిగా తిరగడం చూసి టెన్షన్‌తో రాత్రంతా నిద్రలేకుండా గడుపుతారు మిత్రులిద్దరు. ఆ సొమ్ముని బ్యాంక్ వారికి తిరిగిచ్చేయాలని నిర్ణయించుకుంటారు. **-ఇక చదవండి...**

వ్యాన్ వాళ్ళ పక్కన వచ్చి ఆగింది. వీళ్ళిద్దర్నీ రెండు చేతులు లోపలికి లాగాయి.

★ ★ ★

వ్యాన్ ఓ నిర్మానుష్యమైన ప్రాంతం దగ్గర ఆగింది.

'ఎవరు మీరు.... మమ్మల్ని ఎందుకు తీసుకు వచ్చారు ?" అడిగాడు విభాకర్ వ్యాన్ ఆగాక.

వ్యానులో నుంచి ఓ వ్యక్తి దిగాడు.

దృఢంగా వున్నాడు. తీక్షణమైన కంటిచూపు, చూడగానే మరిచిపోలేని పర్సనాల్టీ.

"హ.. లో... వ్" అన్నాడు అతను వ్యాన్‌లోని లైట్‌వేసి.

లైటు వెలుతురులో అతన్ని చూసి ఉలిక్కి పడ్డాడు విభాకర్.

అప్రయత్నంగా "ను...వ్వా?!" అన్నాడు.

"యస్ నేనే! ఫెల్ట్ హేట్ లాంగ్ కోట్... ఫోన్‌లో వార్నింగ్... రాయిలో ఇరవైరూపాయలు.. అన్నీ నేనే... ఆల్ ఇన్ వన్... సర్వం నేనే!" నవ్వుతూ అన్నాడు.

"మీరు... మమ్మల్ని ఎందుకు యిలా వేధిస్తున్నారు" విభాకర్ అన్నాడు.

"నేను మిమ్మల్ని వేధించానా? ఏం మీరు బ్యాంకులో కోటిరూపాయలు దోచుకోలేదా.. అందులో సగం నాకు యివ్వమని చెప్పాను. దట్సాల్! అంతా హేపీ.... ఆల్ హేపీస్... నో వర్రీస్".

"ఇంపాసిబుల్... ఆ డబ్బులు నీకు యిచ్చే ప్రసక్తి లేదు ఆ డబ్బు ప్రజలది."


"ఈజిట్.... ఆ విషయం తెలిసి ఎందుకు దొంగతనం చేసినట్లో" వ్యంగ్యంగా అన్నాడు అపరిచిత వ్యక్తి..

"బుద్ధి తక్కువై!... అందుకే చేసిన తప్పు సరిదిద్దుకుంటున్నాం"

"సారీ!... నో ఛాయిస్. తప్పు చేయడం వరకే నీ బాధ్యత... ఆ తర్వాత ఆ తప్పు డబ్బును పంచుకోవడం నా వంతు. బుద్ధిగా నాకు సగం ఇచ్చెయ్.

"ఇవ్వకపోతే... ఏం చేస్తావ్?"

"సింపుల్‌గా మీ ఇద్దర్నీ పోలీసులకు పట్టిస్తాను. అప్పుడు మీ ఫ్యూచర్ లైఫ్ అంతా జైలు






గోడల మధ్య గడుస్తుంది. హాయిగా నాకు యాభై లక్షలు యిచ్చి మిగితా యాభై లక్షలతో మీరు మహారాజుల్లా బ్రతుకుతారో... జైలుకు వెళ్ళి భవిష్యత్తు నాశనం చేసుకుంటారో మీ యిష్టం. ఛాయిస్ ఈజ్ యువర్స్. అఫ్ కోర్స్ నేనిప్పుడు బలవంతంగా ఈ దబ్బు లాక్కొని మిమ్మల్ని చంపేసినా ఏమీ చేయలేరు. కానీ మీరు ఛస్తే కేసు అవుతుంది. మొత్తం నేను తీసుకుంటే ఆ కోపంతో మీరు పోలీసులకు అసలు విషయం చెప్పొచ్చు.... అందుకే ఛాన్స్ మీకే యిస్తున్నాను. జైలుకు వెళ్తారో .. నాకు యాభై లక్షలు యిస్తారో మీరు తేల్చుకోండి." ఆ అపరిచిత వ్యక్తి విలాసంగా నవ్వుతూ చెప్పాడు.

విభాకర్ ఏమీ మాట్లాడలేదు.

"అల్ రైట్ ... ఈ రాత్రి అంతా ఆలోచించుకోండి. బట్ డోంట్ ట్రయ్ టు ఎస్కేప్!" అంటూ వ్యాను డోర్లు లాక్ చేసి తను లోపలే కూచుండిపోయాడు ఆ అపరిచిత వ్యక్తి.

* * *

ఇద్దరూ రోడ్డు మీద పరుగెడుతున్నారు.

"బాసూ... మనం చేస్తోన్నపని సరైనదేనా" అడిగాడు పరుగెడుతూనే పండు.

"ఖచ్చితంగా! ఆ బ్లాక్ మెయిలర్ మనల్ని ఎలాగూ వదిలిపెట్టాడు. అతనికి సగం దబ్బు ఇచ్చి, మనం సగం తీసుకొని, కష్టపడి దోచుకున్న ప్రజల దబ్బు దోచుకోవడంలో మనం అతనికి సహకరించడం కన్నా, పోలీసులకు సరెండరై ఈ దబ్బును వాళ్ళకు ఇచ్చేసి, జైలుకు వెళ్ళడం బెటర్."

"పండూ!.... తప్పు చేసిన వాళ్ళు శిక్ష అనుభవించాలి. మనం శిక్ష అనుభవిద్దాం" ధృఢంగా చెప్పాడు విభాకర్.

ఇద్దరూ పరుగెడుతున్నారు పోలీస్‌స్టేషన్ వైపు.

వాళ్ళు బ్యాంకును దాటివెళ్లాలి.

మనీ బ్యాంకు దాటుతుండగా వాళ్లకు చిన్న పాటి అనుమానం కలిగింది.

మనీ బ్యాంక్ వెనుక వైపు ఓ వ్యాన్ ఆగివుంది. అది ఇందాకటి అపరిచిత వ్యక్తిది కాదు. ఆ వ్యానులో నుంచి మొహాలకు ముసుగులు వేసుకున్న అగంతకులు దిగారు.

ప్రహారీ గోడ మీద నుంచి లోపలికి దిగుతున్నారు.

"పండూ! అటు చూడు.... ఎవరో బ్యాంకు దోచుకోవడానికి వచ్చారు. మనం చేసిన తప్పును సరిదిద్దుకునే అవకాశం.... నువ్వోపని చేయి... నేను బ్యాంకు ప్రహారీ దూకి లోపలికి వెళ్తాను. నువ్వు దొంగ దొంగ అని అరువు. కాలనీ అంతా మేలుకుంటుంది. ఈలోగా పోలీస్ స్టేషన్‌కు ఫోన్ చెయ్. నాతోపాటు ఆ దోపిడి దొంగలు కూడా పట్టుబడతారు. ఆ విధంగానైనా ఈ బ్యాంకును కాపాడిన వాళ్ళమవుతాం".

పండుకు మనసొప్పు లేదు.

"బాసూ .. దాని వల్ల నువ్వు ఇరుక్కుంటావు"

"అయినా సరే... నేను చెప్పినట్టు చెయ్"

అయిష్టంగానే ఒప్పుకున్నాడు పండు.

విభాకర్ కోటి రూపాయల సంచీతో ప్రహారీ దూకాడు.


అంతకు ముందే అగంతకులు దూకారు.


పండు గొంతు పెద్దది చేసి "దొంగలు .. దొంగలు" .. అని అరిచాడు.

సెంట్రీ ఎలర్ట్‌య్యాడు.

కాలనీలోని వాళ్ళు నిద్రలేచారు.

హడావిడి .. అలజడి .. టెన్షన్ .. క్షణాల్లో అంతా అలర్ట్‌యింది. పోలీసులు నాలుగువైపుల నుంచి బ్యాంకును చుట్టుముట్టారు. (సశేషం)







# మతి మరపు మంచిదే...

యు.మల్లికార్జున
8143471567

'ఒక కాఫీ' అని ఆర్డరిచ్చి ఏ మూల, ఏ టేబుల్ ఖాళీగా వుందా అని వెదుకుతూ... వస్తున్న సుబ్బారావుకి ఓ మూల టేబుల్ దగ్గర తన ఫ్రెండ్ ప్రకాష్ కన్పించేసరికి అతని దగ్గరకి వెళ్లి కూర్చుంటూ–

"ఏరా! టిఫిన్ చేయడానికి వచ్చావా?" అని అడిగాడు.

"లేదురా... టీ ఆర్డరిచ్చి అరగంటైంది. ఇంకా రాలేదు" అని అసహనంగా చెప్పాడు ప్రకాష్.

"మరి నేను కాఫీ చెప్పా.. ఇదెంతసేపటికి వస్తుందో" తెల్లముఖం వేశాడు సుబ్బారావు.

"త్వరగా వస్తుందిలే గానీ... ఏకాకిలా ఒక్కడివే వచ్చావ్... మనఫ్రెండ్ ఎమ్.ఎమ్. సత్యం ఎక్కడా?"

"కాబోయే అల్లుడికి కట్నం డబ్బులు సగం ముందివ్వాలట. ఆ డబ్బుకోసం ఊర్లో పొలం అమ్మడానికి లీవ్‌పెట్టి వెళ్ళాడు."

"ఒక్కడే వెళ్లాడా?" ఆశ్చర్యంగా అడిగాడు ప్రకాష్.

"లేదు. ఫ్యామిలీతోనే వెళ్ళాడనుకుంటా."

"మరి... పాపం ఒక్కడూ అమీర్‌పేట వెళ్తేనే తనకున్న మతిమరపు వల్ల అవసోపాలు పడ్తాడు. ఇక ఊర్లకి ఒక్కడూ వెళ్తే... మనం వాణ్ని మర్చిపోవాల్సిందే మరి"

"అది నిజమే గానీ... ఆ మతిమరపుతో పాటు భయంకరమైన సమయస్ఫూర్తి వుంది వాడికి. మొన్నోసారి ఓ సంఘటన జరిగింది. దానివల్ల లాభం వుందని తెల్సింది."

"ఏంటది?" ఆసక్తిగా అడిగాడు ప్రకాష్.

"మొన్న ఆఫీసులో బాస్‌తో కూర్చుని మాట్లాడుతుంటే ... సత్యం ఎంటరై బాసుకి ఓ లెటర్ ఇచ్చాడు. "ఏంటిది" అని ఆయన గద్దిస్తే 'లీవ్ లెటర్ సార్' అన్నాడు.

ఆయన వీడికున్న మతిమరుపు సమస్యకి తలబాదుకుంటూ "మొన్నే కదయ్యా... నాల్రోజులు లీవ్ కావాలంటే శాంక్షన్ చేశా' అన్నాడు.

వీడు ఏమంటాడా అని నేను వీడివైపు చూస్తే ఎటువంటి తడబాటూ లేకుండా 'అదీ...సార్ వెళ్ళే పని ముఖ్యమైంది. అందుకే నాల్రోజులు సరిపోవు. మరో నాల్రోజులు పొడిగించాలని ఈ లెటర్' అన్నాడు.

"సరే బయట పి.ఎ.కి ఇవ్వు." అనడమే ఆలస్యం తుర్రుమని పారిపోయాడు.

నేను బయటికి వచ్చి వాణ్ని చూస్తే మరో లెటర్ రాస్తున్నాడు. ఏంట్రా అని అడిగితే 'మొన్న లీవ్ అడిగిన సంగతి మర్చిపోయా. ఆయన అలా అడిగేసరికి మరో నాల్రోజులు అడిగేశా' అన్నాడు.

అలా ఒకరోజుకూడా లీవ్ ఇవ్వని ఆయన దగ్గర ఎనిమిదిరోజులు లీవ్ కొట్టేశాడు" జరిగిన కథ చెప్పాడు సుబ్బారావు.

అంతలో ఆర్డర్ ఇచ్చినవి వస్తే తాగుతూ...

"అన్నీ వున్నా అల్లుడి నోట్లో శని వుందని పాపం మతిమరుపు వాడిపాలిట శాపం" అన్నాడు ప్రకాష్.

❖ ❖ ❖

రైల్వేస్టేషన్‌లో రిజర్వేషన్ ఫారం నింపుతూ వున్నాడు మన హీరో ఎమ్.ఎమ్.సత్యం. అంటే మతిమరపు సత్యం.

ఆ ఫారంలో అన్ని కాలమ్స్‌ని నింపాడుకానీ... రెండు కాలమ్స్‌లో ఏం రాయాలో అర్థం కాలేదు. కొద్దిసేపు ఆలోచించాడు.

మరికొద్దిసేపు తలగోక్కున్నాడు.

అయినా జ్ఞాపకం రాలేదు. వెంటనే సెల్ తీసి 'నా పెళ్ళాం' అనే పేరుని డయల్ చేశాడు. అటువైపు కొద్దిసేటిపటికి వాళ్ళావిడ ఫోన్ లిఫ్ట్ చేసి "ఏంటండీ" అంది.

"అదీ... మనం వూళ్ళో నాల్రోజులుండి నాలుగోరోజు సాయంత్రమే బయల్దేరాలా?" కవర్‌చేస్తూ అడిగాడు సత్యం.

"ఆఁ... అవును. అప్పుడే మర్చిపోయారా? జ్ఞాపకం పెట్టుకు రాసుకోండి 8-11-12న మనం రిటర్న్ అవ్వాలి" అంది పార్వతి.


ఆ మాట విని "హమ్మయ్యా' అని మనసులో అనుకుని–"ఆఁ నాకు తెలుసులేవే. మరో రెండ్రోజులు ఎక్స్‌ట్రా వుందామా అని ఫోన్ చేశా...!"

"మీ మొహం.. ఆ కవరింగ్ ఎందుకూ. తొమ్మిదో తేదీన వియ్యంకులవారికి డబ్బివ్వాలిగా" అని ఫోన్ పెట్టేసింది పార్వతి.

వెంటనే రిటర్న్ జర్నీ డేట్ రాసి ఊపిరి పీల్చుకున్నాడు.

కానీ ఇంకో కాలంలోనే ఏం రాయాలో ఎంత సేపటికీ జ్ఞాపకం రాలేదతనికి.

తనమీదే తనకుఎప్పుడూ రానంత విపరీతమైన కోపం వచ్చిందతనికి. సమయానికి తన



పేరే మర్చిపోయాడు పాపం!

ఎంతసేపటికీ... తనపేరు తనకి గుర్తుకి రాలేదు. ఎవర్ని అయినా "ఏమండీ నా పేరేంటి' అని అడిగితే జవాబు చెప్పకపోగా తనని పిచ్చి వానిగా చూస్తారని భయం.

పోనీ...భార్యకి ఫోన్ చేసి "పార్వతీ నా పేరేంటి?' అని అడిగితే... 'ఆఖరికి మీపేరే మర్చిపోయారా!?' అని మాటలు సాగదీసి తిట్టుం దేమోనని భయం ప్లస్ నామోషి.

"ఛా! చిన్నప్పటినుండి నాపేరు చేతిమీద పచ్చ బొట్టు పొడిపించుకునుంటే బాగుండేది... " అని తనని తాను గుర్తొచ్చిన తిట్లతో తిట్టుకుని...

"దేవుడా! ఈ గండం గడిచే మార్గం లేదా?" అని దేవుడ్ని గుర్తు చేసుకున్నాడు.

"ఏమండీ... సత్యనారాయణగారూ.. ఏదైనా ఊరు వెళ్తున్నారా?" అని ఎవరో అపరిచితవ్యక్తి (సత్యంకి ఆ మనిషెవరో గుర్తుండి ఛావదు కదా!) పలకరించేసరికి...

"అవునండీ" అని "యాహూ! నాపేరు సత్య నారాయణ" అని కేక వేయబోయి తమాయించు కుని ఆ కాలంలో తనపేరు రాసి- అది కౌంటర్‌లో ఇచ్చి టికెట్ తీసుకుని బయల్దేరాడు.

సత్యానికి చిన్నప్పుడు పెద్దగా మతిమరపు వుండేది కాదు. అతను పెరిగి పెద్దయ్యేకొద్దీ... పెట్రోల్ రేటులా అది పెరుగుతూ వచ్చింది. ఒక్కోసారి అది ఆంధ్రప్రదేశ్‌లో డెంగ్యూజ్వరంలా తీవ్రస్థాయికి చేరుకుంటుంది. ఇంకోసారి భారత దేశపు స్టాక్ మార్కెట్‌లా తక్కువగా వుంటుంది.

ఈ మతిమరుపుకి ఏదైనా మందు దొరుకు తుందేమోనని సత్యం ఎక్కిదిగని హాస్పటల్ లేదు. కలవని డాక్టర్ లేదు. చివరికి లాభంలేక మతి మరుపుకి తన సమయస్ఫూర్తిని ఉపయోగించి లాభం పొందుతున్నాడు. నష్టాల్ని మరిచి పోతున్నాడు. ఇలా కాలాన్ని నెట్టుకొస్తున్నాడు.

కాలచక్రం రైలుచక్రంగా గిర్రున తిరిగింది.

◆ ◆ ◆

"ఏమండీ... ఈ బ్యాగ్‌లో పొలం అమ్మిన డబ్బులు 20 లక్షలు, నా నగలు అన్నీ పెట్టాను. మీ మతిమరుపుని పక్కనపెట్టి, ఆఫీసుకి వెళ్తూ... వెళ్తూ... మర్చిపోకుండా అల్లుడుగార్కి ఏదులక్షలు ఇచ్చి మిగతా డబ్బులు, నగలు బ్యాంకులో వేసి వెళ్ళండి" అంది పార్వతి సత్యానికి బ్యాగ్ అందిస్తూ.

"నువ్వు మాటిమాటికి మతిమరుపు గురించి మాట్లాడద్దు" అన్నాడు రోషంగా.

"అయితే చెప్పిన పని మర్చిపోకుండా చేయండి."

"మర్చిపోవడమా... నెవ్వర్. చేస్తాను. చేసి నాకు మతిమరుపు లేదని నిరూపిస్తాను."

"అబ్బో... ఈ మాట నా పెళ్ళయినప్పటి నుండి వింటూనే వున్నా. వినీ వినీ నా చెవులు చాటంత అయ్యాయి."

"అయితే ఈ రోజు కూడా విను" అని బ్యాగ్ తీసుకుని బయల్దేరాడు.



వెళ్తున్న సత్యాన్ని "ఏమండీ" అని పిల్చింది.

"ఏంటి" అన్నాడు సత్యం ఆగి. "మర్చిపోవద్దు" అంది పార్వతి.

"ఆఁ... హితవిధీ" అనుకుంటూ బయల్దేరాడు సత్యం.

ఎలాగైనా మర్చిపోకూడదని రెండుసార్లు గిల్లుకుని, పదే పదే అదే మాటని మననం చేసుకుంటూ... బైక్ డ్రైవింగ్ చేస్తున్నాడు సత్యం.

అతను వెళ్ళేదారిలో ఏదో చిన్న యాక్సిడెంట్ జరగడంతో ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయాడు సత్యం. ఆ ట్రాఫిక్ నుండి బయటపడి యధావిధిగా భార్య చెప్పిన మాట మర్చిపోయి ఆఫీసుకు వెళ్ళిపోయాడు.

◆ ◆ ◆

సాయంత్రం బ్యాగ్ తీసుకుని ఇంటికి బయల్దేరుతుంటే... అప్పుడు ఉదయం భార్య చెప్పిన మాట గుర్తొచ్చి గతుక్కుమన్నాడు సత్యం.

"అయ్యో...! పార్వతి చెప్పిన మాట మర్చి పోయానే... ఈ విషయం తనకి తెలిస్తే... మతి మరపు మహాశయా అని బిరుదిచ్చి జీవితాంతం దెప్పుతూ వుంటుంది. ఈ గండం గడిచే మార్గమేది" అని తక్షణ కర్తవ్యం గురించి ఆలోచిస్తూ... మనసులోనే మథనపడుతూ బయల్దేరాడు.

◆ ◆ ◆

గుమ్మంలోకి అడుగుపెట్టిన వెంటనే సోఫాలో కూర్చుని వున్న పార్వతి అపరభద్రకాళిలా మూడు తలలు, ఆరుచేతులతో తన కోసమే ఎదురు చూస్తున్నట్టు అన్పించింది సత్యంకి.

కిక్కురుమనకుండా వెళ్ళి సోఫాలో కూర్చున్న వెంటనే... "ఏమండీ బ్యాంకులో డబ్బులు, బంగారం వేశారా?... మరి అల్లుడికి డబ్బులిచ్చారా?" ఆతృతగా అడిగింది పార్వతీ.

"దొరికిపోయానురా దేవుడా" అనుకుని ఏం చెప్పాలో అర్థంకాక పిచ్చి చూపులు చూశాడు సత్యం.

ఏదో ఒకటి చెప్పక తప్పదని "ఉదయం ట్రాఫిక్కులలో ఇరుక్కుపోయి అటునుంచి ఆఫీసుకి వెళ్ళిపోయానే" అని నిజం చెప్పేశాడు.

"ఏమండీ" పాలికేకలాంటి చిన్నకేక పెట్టింది పార్వతి.

హార్ట్ఎటాక్ వచ్చినట్టు అదిరిపోయాడు సత్యం.

"ఎంత మంచిపని చేశారండి."

"మంచిపనా...?" అర్థంకాక ఆశ్చర్యంగా అడిగాడు.

"ఆ... ఆ బ్యాంక్‌వాళ్ళు దివాళా తీసి బోర్డు తిప్పేశారుట... ఇందాక టీ.వీ.లో చూశాను."

"హమ్మ... ఎంతపని జరిగింది" అని... చిన్నగా "మరి అల్లుడికి కూడా ఇవ్వలేదు."

"ఇది ఇంకో మంచిపని... వాడు... వాడి ఫ్యామిలీ 420 గాళ్ళని పంతులుగారు చెప్పారు. ఈ విషయం మీకు ఫోన్ చేసి చెబ్దామనుకున్నా ఈ విషయం విని మీకు హార్ట్ ఎటాక్ వస్తుందేమోనని చెప్పలేదు" భర్తపక్కన కూర్చుంటూ చెప్పింది.


"పోనీలెండి... వెధవగోల... మీ మతిమరపు వల్ల మనం దివాళ తీయలేదు. మనమ్మాయి సేఫ్. ఇన్నాళ్టికి ఓ మంచిపని చేశారు" గోముగా అని వెళ్ళిపోయింది పార్వతి.

'నా మతిమరుపు మంచిదే... అప్పుడప్పుడు!" అనుకుంటూ చల్లగా నవ్వాడు సత్యం.

## మతిమరుపు



**మనిషికి మతిమరుపు మరువరాని జబ్బు**
**మతిమరుపు మనిషి మేధస్సుపై కమ్మిన మాయదారి మబ్బు**
మందమతికి మతిమరుపు; బుద్ధిమతికి మతిమెరుపు
మనిషికి తన "ఆసక్తి"ని బట్టే తనకు జ్ఞాపకశక్తి
జ్ఞాపకశక్తి నిజానికి ఓ యుక్తి!
మనం కొన్ని విషయాలను మరచిపోవాలి సత్వరం....
కొన్ని విషయాలను గుర్తుంచుకోవాలి నిరంతరం!
ఏది ఏమయినా...
**మనిషికి మతిమరుపు వుందన్న విషయం గుర్తుండటం కూడా ఓ అదృష్టమే !**
వ్యాపకాలు ఎక్కువైన కొద్దీ మనిషికి జ్ఞాపకాలు తగ్గిపోతాయి
అందుకే... పెద్ద పెద్ద వ్యాపారవేత్తలు, వ్యవహారకర్తలు, మంత్రులు, ప్రధానులు, పారిశ్రామిక వేత్తలు, గొప్పనటులు... వారి పనులన్నీ వారి సెక్రటరీలు, పి.ఏ.ల ద్వారా గుర్తుచేయించుకొని, అన్ని పనులూ సక్రమంగా సమయానికి పూర్తి చేయగలుగుతున్నారు.
సెల్‌లో రిమైండర్‌లూ నేడు సెల్ఫ్ సెక్రటరీలుగా వుపయోగపడు తున్నాయి
మనకు మన జ్ఞాపకశక్తిమీద **సెల్ఫ్‌కాన్ఫిడెన్స్** లేనపుడు...
మనం మన దగ్గరున్న **సెల్‌కాన్ఫిడెన్స్** తో సక్రమంగా పనిచేసుకోవాలి.
ఎవరికీ ఇబ్బంది లేకుండా చూసుకోవాలి.
మనలో చాలామంది కొన్ని విషయాలను మరచిపోవాలన్నా మరువలేక బాధపడుతుంటే....
కొందరు ఏదీ గుర్తుకురాక బాధపడుతుంటారు.
జ్ఞాపకశక్తి అన్నది ఓ మానసిక స్థితి
జ్ఞాపకశక్తి ఓ వైయక్తిక పరిస్థితి
మనిషికి జ్ఞాపకం ఓ సామాజిక బాధ్యత
అందుకే దీనికి ఇంత ప్రాధాన్యత
"మనసుకు గాయం"... మతిమరుపు ఖాయం
అంటుంటారు కొందరు.
ఓ రకంగా మతిమరుపుని నిర్లక్ష్యానికి నిదర్శనంగా చెప్పుకోవచ్చు...
బద్ధకానికి ద్యోతకంగానూ చెప్పుకోవచ్చు. **-బి.ఎమ్.పి.సింగ్**



—మతిమరుపు స్పెషల్—



# మహాపరాధం

అల్లం శశిధర్
9 8 4 9 0 7 5 6 7 2

'సురేఖ' అన్న అరుపుతో ఆ కాలనీ అంతా దద్దరిల్లింది.

అద్దాల మేడల్లోని అద్దాలన్నీ బ్రద్దలయ్యాయి.

ఆ అరుపు ఆకాశంలో ఉరుములాగా వుంది. ఉరుము తర్వాత పిడుగేమైనా పడుతుందా అన్నట్టుంది. అంత గట్టిగా ఏదో పెద్ద సంఘటన జరిగితేనే అరుస్తారు.

సురేఖా అన్న పేరు విని ఆ ఇంటి ఇల్లాలు సురేఖ భయంగా, పరుగు పరుగున వచ్చి చూసింది.

తన భర్త చిదానందం అలా అరిచాడు. పిచ్చి పిచ్చిగా గంతులేస్తూ కైతెక్కలాడుతున్నాడు. తాగినవాడిలా తూలిపోతున్నాడు.

భార్య సురేఖకు విషయం అర్థంకావడంలేదు.

"ఏంటి? ఏం జరిగిందని అలా ఒంట్రుపెట్టి నట్టు అరిచారు. ఎవరైనా వచ్చారా... చచ్చారా ఎందుకా పిచ్చిగంతులు?" అని కోపంగా భర్త మీద విరుచుకుపడింది.

"విషయం తెలిస్తే నువ్వూ ఆగవే! ఇలానే గంతులేస్తావు?"

"గంతులేసేంత గొప్ప అదృష్టం నాకీ జన్మలో రాదు."

"ఇపుడు అదృష్టం ఆముదం పట్టినట్టు పడుతుందోయ్!"

"చెప్పండి... ఆముదం అంటే నాకు అసహ్యం."

"ఏదో ప్రాసకోసం అన్నాను... ఎందుకా విసుగు."

"అయ్యో! ఏమిటీ గోల... ఎప్పుడు నాకీ పీడ విరగడవుతుంది."

"పీడ విరిగిపోయింది. నేను కనుక్కున్నానుగా."

"ఏం కనుక్కున్నారు. ఆ గంతులాపి చెప్పండి" కోపం తారాస్థాయికి వెళ్లింది.

గతుక్కుని గంతులాపి భార్యవైపు భయంగా చూస్తూ... శాంతంగా–

"ఇన్నాళ్ళ నా పరిశోధన ఫలించింది... మతిమరుపుకు మందు కనుక్కున్నానే."

"అయితే ఏంటండి."

"ఇకనుంచి ఈ భూమిమీద మనిషికి మతిమరుపు అనే జబ్బు మాయం కాబోతుంది."

"మతిమరుపు జబ్బు ఎందుకవుతుందండి?"

"అన్ని జబ్బుల్లాగే అది ఒక జబ్బేనే"

"దాంతో నష్టమేముంటుందండి."

"ఎంతో నష్టం. నా జీవితంలోనే ఎంతో నష్టపోయా. ఎంసెట్ ఎంట్రెన్స్‌లో నాకు జవాబు తెలిసిన ఒక ప్రశ్నకు సమాధానం గుర్తుకురాక ఒకే ఒక్క మార్కు తేడాలో డాక్టర్ కావలసినవాణ్ని 'బీఫార్మసీ' చదవాల్సి వచ్చింది. మతిమరుపు వలన జీవితం ఎంతో మారిపోయింది.... డాక్టర్ అయ్యుంటే ఇంకా అందమైన భార్య దొరికి వుండేది."

"నా దురదృష్టం."

"నీ దురదృష్టమా... అంటే ఏంటి?"

"తర్వాత ఏం జరిగిందో చెప్పిచావండి."

"ఆరోజే ప్రతిజ్ఞ చేశాను. మతిమరుపుకు మందు కనుక్కోవాలని. అదిగో అప్పటినుంచి పరిశోధనలు చేసి... చేసి ఇదిగో ఈ రోజు మొత్తానికి మందుకు సంబంధించిన ఫార్ములా సిద్ధాంతాన్ని తయారుచేశాను. దీన్ని ప్రపంచానికి తెలియచేసి, మతిమరుపుతో బాధపడే మానవాళికి మేలు చేస్తాను... నోబెల్ బహుమతి రావచ్చు... పెద్ద పెద్ద కంపెనీవాళ్ళు కోట్ల రూపాయలిచ్చి ఈ ఫార్ములాను కొనుక్కొని వాళ్ళూ... మనం... కోట్లు సంపాదించుకోవచ్చు. నీకు కావలసినవన్నీ కొంటాను. ఏం కావాలో చెప్పు."

"నాకేం వద్దు... ముందు మీమందు ఫార్ములా సిద్ధాంతమో రాద్ధాంతమో అందరికీ చెప్పిచావండి. అది నిజమో కాదో చెప్పనీయండి."

భార్యకు తనమీద మొదటినించి చిన్నచూపే. పట్టించుకోడు. ఫర్లేదు. పోనీలే... కానీ ప్రపంచానికి ఈ ఫార్ములాను వెల్లడించాలనుకొని ఒక రోజు పెద్ద ఎత్తున మీడియా సమావేశం ఏర్పాటు చేయించాడు. మీడియా అంతా ఆత్రుతగా ఆసక్తిగా ఎదురుచూడసాగారు.

చిదానందం తన సిద్ధాంత గ్రంథాన్ని చంకలో పెట్టుకొని ఆంజనేయస్వామిని, వేంకటేశ్వర స్వామిని, అమ్మవారిని, విఘ్నేశ్వరున్ని, శివాలయాన్ని దర్శించి అందరికీ అభిషేకాలు చేయించి దేవుళ్ళ ఆశీర్వాదాలు తీసుకొని మీడియా హాలు కొచ్చి తన సిద్ధాంత గ్రంథాన్ని ఆవిష్కరించి ప్రపంచానికి మతిమరుపు పీడ విరగ్గొడతామంటే... చంకలో గ్రంథం లేదు. దాన్ని గుళ్ళన్నీ తిరిగేటప్పుడు ఎక్కడో పెట్టి మరిచిపోయాడు. ఎక్కడ పెట్టాడో ఎంతకూ గుర్తుకురావడం లేదు.


బుర్ర బ్రద్దలు కొట్టుకున్నాడు.


తలబాదుకున్నాడు. గుండెలు బాదుకున్నాడు. ఎంతకీ ఎక్కడ పెట్టాడో, ఎక్కడ మరిచిపోయాడో గుర్తుకురావడం లేదు. రాలేదు.


చిదానందం మతిమరుపు వలన మతిమరుపు జబ్బు నయం చేసే మందు ప్రపంచానికి తెలియకుండా పోయింది.

మతిమరుపు మానవాళికి ఇది మరిచిపోలేని ద్రోహం... మహాపరాధం.


# మరుపానందం



రూట్ మర్చిపోయి అన్నిరోడ్లూ తిప్పుతున్నానని ఎవ్వరితోనూ చెప్పకేం!!


అక్కా! మరచిపోయి ఈ పాలన్నీ నేనే త్రాగేశా! సారీ!! మళ్ళీ రేపు పాలన్నీ నువ్వే త్రాగేసెయ్.. సరేనా!


మా ఆవిడకుండే మతిమరపుతో నిన్న వంటంతా తనే చేసింది బాబాయ్...


ఏమండోయ్... కొస్త నా కళ్ళద్దాలు ఎక్కడున్నాయో చూడండి...!!
నీ మతిమరుపు మండ... నీ అద్దాలు నీ నెత్తిన ఉన్నాయి... నా కళ్ళద్దాలు ఎక్కడున్నాయో చూసి చెప్పు..!!


అరెరె— లోపల బనియను వేసుకోవటం.. మరిచిపోయానే..!!
BUSSA-MARTIN


...ఈ వయసులో నాకు మతిమరుపు రావడం హాయిగా వుందిరా.. గంట క్రితం మా ఆవిడ తిట్లు సణుగుడ్లు నాకు గుర్తుండీ చావట్లేదు.. హాయిగా వుంది...

మతిమరుపు స్పెషల్



# విడాకులు


సాయిశ్రీ

8500703107


వరండాలో కూర్చుని పేపర్ చదువుకొంటున్న క్రిష్ణమూర్తి దగ్గరకు విసురుగా వచ్చి చంకలో వున్న మూడేళ్ళ కూతుర్ని దభీమని క్రిష్ణమూర్తి ఒళ్ళో పడేసి- "ఏమండీ! నాకు విడాకులు కావాలి" చెప్పింది సత్యభామ.

"అలాగే, ఒక అరగంటలో తెచ్చియిస్తాను" తలతిప్పకుండానే చెప్పాడు క్రిష్ణమూర్తి.

మండిపోయింది సత్యభామకి.

"అరగంటలో తెచ్చిస్తారా? నేను ఏం అడిగానో సరిగ్గా విన్నారా?" విసురుగా అంటూ పేపరు లాగి విసిరికొట్టింది.

"ఏం అడిగావు?" శాంతంగా అడిగాడు.

"విడాకులు!" అక్కసుగా చెప్పింది.

అదిరిపడ్డాడు క్రిష్ణమూర్తి.

శ్రీమతి విసుర్లు, చికాకులు రోజూ వుండే గోలే అయినా ఈ 'విడాకుల' గోల ఆ రోజు కొత్తగా వినిపించడంతో కొద్దిగా కంగారు పడ్డాడు. అయినా తానుకూడా తన భార్యలాగా అరిచి గోపెడుతూ వుంటే పోయేది తమ పరువే అన్న ఆలోచనతో ఏమీ సమాధానం చెప్పకుండా మౌనంగా లేచి లోపలికి నడిచాడు.

భర్త మౌనం సత్యభామ కోపాన్ని ఆకాశాన్నంటేలా చేసింది.

అంతే! అప్పటికప్పుడు ఒక నిర్ణయానికి వచ్చేసింది.

వెంటనే ఫోన్ చేసి తండ్రిని పిలిపించింది.

సాయంత్రం ఆఫీసునుంచి యింటికి వచ్చిన క్రిష్ణమూర్తి మధ్యగదిలో పిల్లలతో ఆడుకుంటున్న మామగారిని చూసి ముందు తెల్లబోయినా తర్వాత తేరుకుని- "బాగున్నారా మామయ్యా! ఎప్పుడు వచ్చారు?" పరామర్శించాడు.

"ఆ, బాగున్నాను" క్రిష్ణమూర్తిని అదోలా చూస్తూ గంభీరంగా చెప్పాడు శంకర్రావు.

మామగారి చూపులకు అర్థమేమిటో అర్థం కాక పిల్లిలా లోపలికి వెళ్ళిపోయాడు క్రిష్ణమూర్తి.

◆ ◆ ◆

భోజనాలు పూర్తిచేసి, పిల్లల్ని నిద్రపుచ్చిన తర్వాత కబుర్లు చెప్పుకొంటున్న తండ్రి, భర్త దగ్గరకి వచ్చి కూర్చుంది సత్యభామ.

"నాన్నా! అసలు విషయం మాట్లాడండి" భర్త వైపు కొరకొర చూస్తూ చెప్పింది సత్యభామ.

"అసలు విషయం ఏమిటి? పండగకు రావడం కుదరదని చెప్పానుగా" అన్నాడు క్రిష్ణమూర్తి.

"అదే అల్లుడూ! అమ్మాయి విడాకులు ఇస్తానంటోంది. మరి నీ సంగతేంటి?" కులాసాగా అడిగాడు శంకర్రావు.

హతాశుడయ్యాడు క్రిష్ణమూర్తి.

"అదేమిటి మామయ్యా! సత్య ఏదో తొందరపాటులో అంటే సర్ది చెప్పవలసింది పోయి మీరు కూడా ఇలా మాట్లాడుతున్నారేంటి?" లబలబలాడాడు.

"ఏమైనా మనసు విరిగిన తర్వాత అనవసరం అల్లుడూ. నా కూతురు నాకు బరువు కాదు. ఇక పిల్లలు అంటావా! చెట్టు కాసిన కాయలు వాటితోనే అంతరించిపోదు. ఆ కాయల విత్తనాలు పడి మళ్ళీ కొత్తచెట్లు మొలుస్తాయి. అలా అని పెద్దచెట్టు వుంది కదా అని కొత్తగా మొలిచిన మొక్కల్ని పీకి పారేయము కదా! నా పిల్లతో పాటు దాని పిల్లలు. ఎవరూ నాకు బరువు కాదు. నీ నిర్ణయం చెపితే ముగ్గుర్నీ తీసుకెళ్ళిపోతాను" గంభీరంగా చెప్పాడు శంకర్రావు.

జుట్టు పీక్కున్నాడు క్రిష్ణమూర్తి మామగారి ఉపమానానికి.

"మనసు విరిగిపోయిందా! అంతగా మనసు విరిగిపోయేలా నేనేం చేశాను. పెళ్ళయి ఎనిమిదేళ్ళు అయింది. ఇద్దరు పిల్లలు... జీతం అంతా తెచ్చి నీ చేతిలోనే పెడతాను. హాయిగా వుండక మనసు విరిగిపోయిందని విడాకులు అడుగుతావా?" భార్యపై ఎగిరిపడ్డాడు.

"ఆc... ఏడేళ్ళు నిండి ఎనిమిదో యేడు వచ్చిందనే నా బాధ. అందుకే ముందు జాగ్రత్త పడుతున్నాను" చేతులు తిప్పుతూ అంది సత్యభామ.

"అర్థమయ్యేలా చెప్పి ఏడువ్!" కసిరిపారేశాడు.

"పెళ్ళయిన ఏడేళ్ళకి భర్త మనసు మరొకరి మీదకు మళ్ళుతుందని ఏదో సినిమాలో చూశాను. అప్పుడే నిర్ణయించుకున్నాను. నాకు పెళ్ళై ఏడేళ్ళు నిండినప్పటినుంచి జాగ్రత్త పడాలని. సినిమాలో హీరోయిన్ చేసినట్టుగా నాకంత నాటకాలాడే ఓర్పు లేదు. అందుకే నాకు విడాకులు కావాలి. అంతే!" తెగేసి చెప్పింది సత్యభామ.

నోరు తెరిచాడు క్రిష్ణమూర్తి.

